Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03




నెల్లూరు, 15.11.2019, శుక్రవారం | సంపుటి : 39 సంచిక : 24 | పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## అసాధ్యుడు.. అజేయుడు.. నరేంద్రుడు...

# సంచలనాల సారథి



* దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలకు శాశ్వత ముగింపు
* ప్రశాంతంగా 'అయోధ్య' పరిష్కారం కావడంతో ప్రభుత్వంపై ప్రశంసలు
* భవిష్యత్‌లో 'ఒకే దేశం - ఒకే చట్టం' రూపకల్పన జరగొచ్చనే ఆశలు
* త్వరలో రిజర్వేషన్‌లపై కూడా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూలా రాజవంశం నుండి రాలేదు... శ్రీమతి ఇందిరాగాంధీ లాగా రాజకీయ వారసత్వం లేదు... లాల్‌బహుదూర్‌శాస్త్రి లాంటి బ్రాహ్మణోత్తముడు కాదు... పి.వి.నరసింహారావులా బహుభాషా కోవిదుడు కాదు... వాజ్‌పేయి కున్నంత రాజకీయ పరిణితి లేదు... మన్మోహన్‌సింగ్‌లా ఆర్థిక నిపుణుడు కాదు... అయినా, ఆయన నిర్ణయాలు సంచలనాలు... ఆయన అడుగులు బలపడుతున్న భారత్‌కు సంకేతాలు... ఆయన ఆజ్ఞలు విడిపోతున్న సమస్యల చిక్కుముళ్ళకు ప్రతి రూపాలు... ఆయనే భారత ప్రధాని నరేంద్ర మోడీ.

(మిగతా 11వ పేజీలో)

## టీడీపీ అసంతృప్తులు

# వైసిపి వైపా? బీజేపీ వైపా..?

➤ మునిగిన పడవలో వుండలేక... ప్రత్యామ్నాయం కోసం పక్కచూపులు

11లో

అ ఆ ఇ ఈ A B C D

## తెలుగు.. అమ్మ మాట - ఇంగ్లీష్.. బ్రతుకు బాట

# భాషపై వ్యర్థ ప్రయాస

> ఇంగ్లీష్ మీడియం అంటే 'తెలుగు'ను తెరమరుగు చేయడం కాదు
> కార్పొరేట్ స్కూళ్లలో అయితే ముద్దు.. ప్రభుత్వ బడుల్లో వద్దా..?
> సినిమాలలో అదే సీన్ చూస్తే చప్పట్లు... నిజ జీవితంలో చేస్తే చీవాట్లా?

**మన స్నేహితుడు తల్లిని మనం మంచిది అన్నామంటే సొంత అమ్మ చెడ్డదని కాదు. సొంత అమ్మకు ఎప్పుడూ ఉన్నత స్థానమే వుంటుంది. అదే సమయంలో ఎదుటివారి గొప్పదనాన్ని కూడా గుర్తించాల్సి వుంటుంది.**

మన దేశానికి సంబంధించింది కాదు, మనవాళ్ళు కనిపెట్టినవి కావు అని రోగాలు వచ్చినప్పుడు ఇంగ్లీష్ వాళ్ళు కనిపెట్టిన మందులు వాడకపోతే అసలుకే ఎసరొస్తుంది. సంస్కృతి, భాష, సాంప్రదాయాలు వేరు... అదే సమయంలో మారుతున్న ఆధునిక పోకడలకు అనుగుణంగా జీవనశైలిని మార్చుకోవడం వేరు. ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడి మీదకు రాకెట్‌లను పంపుతున్నారు, అది సాంకేతికత. రాకెట్‌ను పంపే ముందు తిరుమలలో శ్రీవారి చెంత పూజలు నిర్వహిస్తున్నారు... అది సాంప్రదాయం. సాంకేతికంగా మనం ముందడుగులు వేస్తున్నా, దాంతోపాటే సాంప్రదాయాన్ని కూడా తీసుకెళుతున్నాం. అలాగే ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టినంత మాత్రాన తెలుగు భాషను విస్మరించినట్లు కాదు, తెలుగు యాసను మరచిపోతున్నట్లు కాదు. అసలు తెలుగునేలపై పుట్టి తెలుగు మాట్లాడలేని వాడికి జీవితమే సార్ధకత కాదు. ఎందుకంటే ఎన్ని ఇతర భాషలు నేర్చుకున్నా తన తల్లిదండ్రులతో, అవ్వా తాతలతో అతను చివరకు మాట్లాడాల్సింది, భావాలను, బాధలను పంచుకోవాల్సింది తెలుగుభాషలోనే!

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్‌మీడియంను ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై విపక్షాలలో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. తెలుగుదేశం, జనసేన నాయకులు దీనిపై విమర్శలు చేయగా, బీజేపీ నాయకుల్లో కొందరు విమర్శిస్తూ, ఇంకొందరు సమర్థిస్తూ మాట్లాడారు. టీడీపీ, జనసేన నేతలైతే తెలుగుకు పాడె కడుతున్నారంటూ జగన్‌పై మండిపడ్డారు. దీనికి జగన్ కూడా సరిగ్గానే కౌంటరిచ్చాడు. చంద్రబాబు, పవన్, వెంకయ్యనాయుడుల పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారంటూ ప్రశ్నించాడు. మీ పిల్లలైతే ఇంగ్లీష్ మీడియంలో చదవొచ్చు, ప్రభుత్వ బడుల్లో చదివే పేదపిల్లలకు ఇంగ్లీషు మీడియం అక్కరలేదా అంటూ ఆయన సంధించిన ప్రశ్నకు విపక్షాల వద్ద సమాధానం లేదు.

ఎన్నికలకు కొన్ని నెలల ముందు ప్రిన్స్ మహేష్‌బాబు హీరోగా నటించిన 'భరత్ అనే నేను' సినిమా వచ్చింది. ఆ సినిమాలో సీఎంగా హీరో మహేష్ నటించాడు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను (మిగతా 11వ పేజీలో)



## ఇకనైనా కళ్ళు తెరవాలి!...



# మురుగు రాకాసిపై..
# యుద్ధం ప్రకటించాలి

- **జిల్లాలో 107 డెంగ్యూ కేసులు నమోదైనా పట్టించుకోరా?...**
- **నిర్లక్ష్యం వీడండి.. నగరాన్ని ప్రక్షాళన చేయండి!**

**సింహపురి సమాచారం**

*నెల్లూరు జిల్లా మురికికూపం లోకి కూరుకుపోతోంది. వ్యాధులు ప్రబలి ప్రజలు అల్లాడిపోతున్నారు.*

*ఇప్పటికే జిల్లాలో 107 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని మలేరియా అధికారులే చెప్తున్నారు.*

*అయినా, అధికారులెవరూ ఈ వ్యాధుల తీవ్రతను పట్టించుకోక పోవడం దారుణం!..*

*ఇకనైనా అధికారులు, ఎక్కడికక్కడ ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, ప్రజాప్రతినిధులు.. స్వచ్ఛంధసంస్థల వారు అందరూకలసి, అన్ని వ్యాధులకీ కారణమవుతున్న ఈ మురుగు రాకాసి పై వెంటనే యుద్ధం ప్రకటించాలి.*

*చీపుర్లు, పలుగూ పారా చేతబట్టి మన పరిసరాలను మనం పరిశుభ్రం చేసుకోవాలి. మనం వేసుకున్న చెత్తను మనమే తొలగించుకోవాలి. అప్పుడే ఈ మురుగుదిబ్బల గబ్బు నుంచి బయటపడగలం!...*

గతంలో ఒక డెంగ్యూ కేసు వచ్చిందని తెలియగానే జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధికారులు అందరూ అలర్ట్ అయిపోయేవారు. ఎక్కడికక్కడ చెత్తకుప్పలను, మురుగుదిబ్బలను ప్రక్షాళన చేసే కార్యక్రమానికి పూనుకునేవారు. ఇప్పుడా రోజులు పోయాయి. పారిశుద్ధ్యం ఎంత అద్వాన్నంగా తయారైనా, కుళ్ళిపోయిన చెత్తాచెదారమంతా రోడ్లమీద పొర్లుతున్నా, వాటిలో పందులు పొర్లాడుతున్నా, దోమలు కుప్పలుతెప్పలుగా విజృంభిస్తున్నా ఎవరికీ చీమ కుట్టినట్లు కూడా ఉండడం లేదు. మొన్నటికి మొన్న జిల్లా కలెక్టరే స్వయంగా నగరంలో కొన్నిప్రాంతాల్లో పర్యటించి టన్నులకొద్దీ చెత్త, ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయి భరించలేనంత దుర్వాసన వెదజల్లుతున్న మురుగుకాల్వలను చూసి అవాక్కయిపోయారు. అసలు పారిశుద్ధ్య సిబ్బంది ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇలా ఉన్నతాధికారులు ఆగ్రహించినప్పుడల్లా సంబంధిత అధికారులు, సిబ్బంది చెత్తనంతా పరిశుభ్రం చేస్తున్నట్లు హడావిడి చేయడం తప్ప ఆచరణలో అంతా నామమాత్రపు చర్యలే!..అంతెందుకు సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్రమోడీ అంతటి అత్యున్నతస్థాయి నేతే చీపురుపట్టుకుని వీధులు చిమ్మి పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి..స్వచ్ఛభారత్ సాకారానికి కృషిచేయండని పదేపదే పిలుపునిస్తున్నా, అదేదో మనకు సంబంధించిన కార్యక్రమం కానేకాదన్నట్లుగా ఎవరికి వారు నిర్లక్ష్యం చేస్తుండడం వల్లే పరిస్థితి ఇంత ఘోరంగా తయారైందా అనిపిస్తోంది.

### అన్ని వీధులూ..అన్ని ప్రాంతాలూ గబ్బే!..

అపారిశుద్ధ్యంలో నెల్లూరు అగ్రస్థానంలో ఉంది. ఇంతగా గబ్బుకొట్టిపోతున్న నగరం రాష్ట్రంలో మరొకటి ఉండదేమో!.. నగరంలోని రోడ్లే మురుగు కాలువలుగా, అన్ని వీధులూ చెత్తకుప్పలుగా తయారైపోయాయి. ప్రధానమైన ట్రంకురోడ్డు, చిన్నబజారు, పెద్దబజారు, స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, కూరగాయల మార్కెట్, చేపలమార్కెట్ వగైరా ప్రాంతాలు..విద్యాలయాలు, వైద్యాలయాలు, దేవాలయాలు ఉండే ప్రాంతాలు...ఇలా ఒకటేమిటి ఎక్కడచూసినా మురుగుడు గబ్బే!..ఆయా ప్రాంతాల్లోని సైడుకాలువలు, వీధులు, చెత్తకుప్పలు, మురుగుదిబ్బల్లో కుప్పలుతెప్పలుగా ప్లాస్టిక్‌కవర్లతో, చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయి. ఉదాహరణకి కూరగాయల మార్కెట్ పక్కనున్న పండ్లదుకాణాలున్న వీధిలోకి వెళ్తే ఆ దుర్గంధానికి కళ్ళు బైర్లుకమ్మి వాంతులు రాక తప్పదు. ముక్కులు, నోరు మూసుకుని ఉగ్గబట్టి ఆ రోడ్డు దాటుకుని వెళ్ళాల్సిన దుస్థితి. పరిస్థితి ఇంత భయంకరంగా ఉన్నా పట్టించుకునే నాధులే లేరు. ఇకపోతే నగరం నడిబొడ్డులోని ట్రంకురోడ్డుతో పాటు ఇరువైపులా ఉన్న అనేక రోడ్లు ఎప్పుడూ మురుగుగబ్బుతోనే విలసిల్లుతుంటాయి. ఆ ప్రాంతాల్లోని సన్నసన్న వీధులు అసలు కాలుపెట్టలేనంత ఘోరంగా ఉంటాయి. ఎక్కడ చూసినా సైడు కాలువలు నిండిపోయి, వాననీళ్లు పొయ్యే మార్గం లేక డ్రైనేజీ నీరంతా రోడ్లమీదికి వచ్చి నగరం రోజురోజుకీ గబ్బుకొట్టిపోతోంది. ఇకపోతే, నెల్లూరు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయడమంటే ఆ దేవుడే దిగి రావాలి అన్నట్లుంది పరిస్థితి. నగరంలో రానురాను పారిశుద్ధ్య పరిస్థితి పరమ అధ్వాన్నంగా తయారై, ఇక ఎవరూ బాగుచేయలేరన్నంతగా చేయిదాటిపోతోంది.

### ఎవరో వస్తారని..
### ఏదో చేస్తారని.. ఎందుకనుకోవాలి?...

ఏ వీధి చూసినా మనం వేసిన చెత్తాచెదారాలే మనల్ని వ్యాధుల్తో కాటువేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. నానాటికీ విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలిపోతున్నాయే తప్ప అవి తగ్గే జాడ కనిపించడం లేదు. వీధులన్నీ మురుగుగబ్బుతో, పందులు, దోమలతో నిండిపోతుండడంతో ప్రజలు రకకాల వ్యాధులతో బాధలు పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరెంతగానో ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నా జేబుల్లో డబ్బులు అయిపోతున్నాయే తప్ప జబ్బులు మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో పేదలు, సామాన్యులు, మధ్యతరగతి ప్రజల అవస్థలు వర్ణనాతీతం! అయినా..ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎందుకనుకోవాలి?..ఎంతకాలం ఇలా మురుగుగబ్బులో కుళ్ళుతూ బతకాలి?... మన పరిసరాల్ని మనం పరిశుభ్రం చేసుకోలేమా?..ఆ మాత్రం సత్తా మనకు లేదా?.. చిత్తశుద్ధితో అందరూ ఆలోచించాల్సిన విషయమిది!

### అందరూ కలిస్తే..
### మురుగు రాకాసికి మూడినట్లే!...

రోజురోజుకీ వేలు..లక్షల టన్నులుగా పెరిగిపోతున్న చెత్తను తొలగించి పరిశుభ్రం చేయాలంటే సామాన్యమైన విషయమేమీ కాదు. ఇది ఏ ఒక్కరో చేయగలిగే పని కాదు. అందుకు ముందుగా ఉన్నతాధికారులు కనీసం ఓ వారం రోజులు యుద్ధప్రాతిపదికన అమలుచేయాల్సిన ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలి. పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్య పరిరక్షణకు సంసిద్ధం కావాలి. మురుగు రాకాసిపై యుద్ధం ప్రకటించి, ఆయా ప్రాంతాల్లోని అన్నిపార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల వారు, యువత, ప్రజలు తమవంతు కర్తవ్యంగా.. ప్రతి ఒక్కరూ ఒక కార్యకర్తగా రంగంలోకి దిగాలి. మరోవైపు చెత్తను ఎత్తివేసేందుకు కావాల్సిన సామగ్రి, చెత్తను తొలగించేందుకు వాహనాలు, పారిశుద్ధ్య సిబ్బంది అంతా నడుము బిగించి ముందుకు కదలాలి. ఇలా అందరూ చేయిచేయి కలిపి కదిలితే తప్ప ఎంతోకాలంగా నలుగుడుబడని ఈ సమస్య ఒక కొలిక్కి రాదు. ఒక వారం రోజుల పాటు నిర్ణీత తేదీల్లో నిర్ణీత ప్రాంతాల్లో ప్రతిచోటా, ప్రతి వీధిలో మురుగుకాలువలను, చెత్తాచెదారాలను ప్రక్షాళన చేసే దిశగా అందరూ సమాయత్తం కావాలి. 'మనవాడు తల్చుకుంటే చాలు.. ఏదైనా చేసేస్తాడు'.. అన్నట్లుగా మనం తలుచుకుంటే జరగనిది ఏముంటుందీ?.. అందరూ కలసి ఒక్కసారి 'జై! స్వచ్ఛభారత్'..అంటూ పలుగూ పార చేతబట్టుకుంటే మురుగురాకాసే కాదు.. ఎంతటి పెద్ద భూతాన్నయినా తరిమికొట్టవచ్చు. అందరూ కలిస్తే..ఇక మురుగు రాకాసికి మూడినట్లే!.. ఏమంటారు?!..

## వెంకటాచలం ఆసుపత్రిని
# తనిఖీ చేసిన కలెక్టర్


రిజిష్టరును తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు

జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు బుధవారం వెంకటాచలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. పారిశుధ్యాన్ని పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక పరికరాలు, మందుల విభాగాలను పరిశీలించారు. మందుల విభాగంలో కాలంచెల్లిన మందులు వుండడంపై ఫార్మాసిస్టును ప్రశ్నించారు. మందుల విషయంలో జాగ్రత్తగా వుండాలని, మందులు ప్రాణం పోయాలేగాని, ప్రాణాలు పోయేవి కారాదని అన్నారు. విధులకు గత కొంత కాలంగా హాజరుకాని డ్యూటీ డాక్టర్ పద్మశ్రీని, సీనియర్ అసిస్టెంట్ బాలాజీ సుకుమార్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ, వారిని సస్పెండ్ చేయాలని సిసిహెచ్‌ఎస్‌కు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆసుపత్రి సేవల జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుబ్బారావు కూడా పాల్గొన్నారు.

## వేదవ్యాస స్కూలులో బాలల దినోత్సవం



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని వేదవ్యాస స్కూలులో ఈనెల 14న బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు నెహ్రూ వేషధారణలో వచ్చి అందరిని అలరించారు. నెహ్రూ జీవితచరిత్ర గురించి, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర గురించి, నెహ్రూ పుట్టిన రోజును పిల్లల దినోత్సవంగా జరుపుకోవడం గురించి స్కూలు కరస్పాండెంట్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నెహ్రూ జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన ఇచ్చారు. స్కూలు కరస్పాండెంట్ ఎపి బాలాజి, డైరెక్టర్ వేదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయిని చేరుకోవడానికి కృషిచేయాలని, ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త చాగణం గౌరీశంకర్ అన్నారు. నెల్లూరు దర్గామిట్టలోని వెలమ సంఘం కార్యాలయంలో ఈనెల10న ప్రతిభ కల పేద వెలమ విద్యార్థులకు దువ్వూరు నారాయణయ్య మెమోరియల్ ట్రస్టు, జిల్లా వెలమ సంఘం ఆధ్వర్యంలో 136 మంది డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు 9.5 లక్షల రూపాయలను ఉపకార వేతనాలుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గౌరీశంకర్ మాట్లాడుతూ చదువుతోనే ఉన్నతశిఖరాలను అందుకోగలమని, విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో ప్రతిభతో రాణించాలని సూచించారు. జిల్లా వెలమ సంఘం అధ్యక్షుడు పెనుబల్లి సీతారామనాయుడు, పెనుబల్లి హనుమంతరావునాయుడు, విశ్వం, చాగణం శ్రీలక్ష్మిని ఘనంగా సన్మానించారు. పెళ్లూరు రామయ్య, జలదంకి నాగేశ్వరరావు, గిద్దలూరు వెంకటేశ్వర్లు, రాయసం హృషీకేశవరావు, పంచేటి ప్రసాద్‌రావు, రాయసం కళాచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పేర్నాడుకు ఆర్టీసీ బస్సులు బంద్

నెల్లూరు జిల్లాలోని సూళ్ళూరుపేట–పేర్నాడు రోడ్డు బాగయ్యేంత వరకు ఆర్టీసీ బస్సులు నడపొద్దని నెల్లూరు రీజినల్ మేనేజర్ టీవీ రామం డిపో అధికారులను ఆదేశించారు. ఈనెల 6 న రాత్రి పేర్నాడు బస్సు బోల్తాపడిన ఘటనా స్థలాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించి, అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రోడ్డంతా గుంటలమయంగా ఉందని ప్రమాదం జరిగిన బస్సు గుంటల్లో పడి కట్టలు విరిగిపోయి ప్రమాదానికి గురైందన్నారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన గుంటలకు ప్యాచ్‌వర్క్ చేస్తేనే బస్సులను నడపగలమన్నారు. డిపో మేనేజర్ బండ్ల కుమార్ తదితరులు ఉన్నారు.

## 17 న కార్తీకమాస మహారుద్రాభిషేకం

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సింహపురి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన నెల్లూరు బాలాజీనగర్‌లోని త్యాగరాజ కళ్యాణ మండపంలో కార్తీక మాస మహా రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16వ తేది సాయంత్రం సంగీత విభావరి, 18న నగరోత్సవం జరుగుతుందన్నారు.

# 1500 కోట్లతో 15వేల బళ్లకు వెలుగు

## - మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్



'మనబడి నాడు - నేడు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

రాష్ట్రంలో 1500 కోట్ల రూపాయల వ్యయంతో 15వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 14న నెల్లూరు పొదలకూరురోడ్డులోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 'మన బడి నాడు - నేడు' కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ యం.వి.శేషగిరిబాబు, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యంలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారని, మన బిడ్డల బంగారు భవిష్యత్ కోసం ఆయన గొప్ప నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిని కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నెల్లూరు రూరల్ కార్యాలయం ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైసిపి నాయకులు తాటి వెంకటేశ్వర్లు, నూనె మల్లికార్జునయాదవ్, మొయిళ్ళ గౌరి తదితరులు పాల్గొన్నారు.

## ● ఫలించిన విపిఆర్ ప్రయత్నం

# జిఎస్టీ నుండి చింతపండు మినహాయింపు



జిఎస్టీ నుండి చింతపండుకు మినహాయింపు ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేసిన ప్రయత్నం ఫలించింది. జిఎస్టీ నుండి చింతపండును తొలగిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. నెల్లూరు నగర కమీషన్ మర్చంట్స్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ఈ ఏడాది జూలై 24వ తేదీన జిఎస్టీ నుండి చింతపండును తొలగించాలని కోరుతూ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక లేఖ ద్వారా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ను కోరారు. ఈ ఏడాది సెప్టెంబర్ 20వ తేదీన జరిగిన జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని చర్చకు పెట్టి చింతపండును జిఎస్టీ నుండి తొలగించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. తదనుగుణంగానే జిఎస్టీ నుండి చింతపండును తొలగించే ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. తన వినతిని మన్నించి వ్యాపారుల సౌలభ్యం కోసం చింతపండుపై జిఎస్టీ తీసేసినందుకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# విశ్వసాయిలో బాలల దినోత్సవం



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి డా. ఎస్ఆర్‌కె స్కూల్‌లో ఈ నెల 14వ తేదీన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు నృత్య పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా. యం.సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని, తొలి ప్రధానిగా ఆధునిక భారతదేశ నిర్మాణానికి ఆయన ఎంతగానో కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ జి.కృష్ణమోహన్, డీన్ ఎస్.రఘురాం, ప్రధానోపాధ్యాయులు శ్రీమతి బ్యూలాగ్రేస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించి వివిధ ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులందజేశారు.

# పోటీ ప్రపంచంలో ఆంగ్లం అవసరముంది

## - ఉపసభాపతి రఘుపతి



ప్రపంచమే ఓ కుగ్రామంగా మారి, జీవనం కోసం మనిషి ఈ కుగ్రామంలో ఎక్కడైనా పనిచేయాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలోనే ఆంగ్లం నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోన రఘుపతి పేర్కొన్నారు. ఈ నెల 13న ఆయన తిరుమల శ్రీవారి దర్శనార్థం వెళుతూ నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించారు. తల్లిదండ్రులు ఇంగ్లీష్ మీడియం వైపే మొగ్గుచూపుతూ తమ బిడ్డలను ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారని, ప్రస్తుత కాలంలో ఉపాధి అవకాశాలు కూడా ఇంగ్లీష్ భాష ప్రావీణ్యం వున్నవారికే ఎక్కువగా వుంటున్నాయని, రానురాను విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ నిర్వీర్యమైపోతుందని, ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడుకోవాలంటే ఇక్కడ కూడా ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టక తప్పదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టినంత మాత్రాన తెలుగుభాషను నిర్లక్ష్యం చేసినట్లు కాదని, మాతృభాషకు ఎప్పుడూ ప్రాధాన్యత, గౌరవం తగ్గదన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాలలో ఉద్యోగ అవకాశాలు కావాలంటే హిందీ, ఇంగ్లీష్ భాషలపై పట్టుండాలన్నారు.

# ఆధునిక భారత రూపశిల్పి నెహ్రూ



మాట్లాడుతున్న చేవూరు దేవకుమార్‌రెడ్డి

ఆధునిక భారతావని రూపశిల్పి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూయేనని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ 130వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14వతేదీన నెల్లూరు, మద్రాసుబస్టాండ్ వద్ద వున్న ఆయన విగ్రహానికి దేవకుమార్‌రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్ట్‌లే ఆధునిక దేవాలయాలని చెబుతూ దేశవ్యాప్తంగా రైతుల కోసం భారీ సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన ఘనత ఆయనదే నన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే, దానిని అమలు చేసిన మహనీయుడు నెహ్రూ అని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రగతికి, ఆర్థిక అభివృద్ధికి నెహ్రూ ఎంతో కృషిచేశారని, నేటి మోడీ ప్రభుత్వం ఆ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి ఎస్‌పిజి భద్రతను తొలగించడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావ్, రఘురాం ముదిరాజ్, మధుయాదవ్, భవానీ నాగేంద్రప్రసాద్, టి.బాలసుధాకర్, ఫయాజ్, మోహన్‌రెడ్డి, షబ్బీర్, కొండా అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# ఇసుకను ఉచితంగా ఇవ్వాలి

## - వామపక్షాల ర్యాలీ

రాష్ట్రంలో భవన నిర్మాణ రంగాన్ని కుదిపేస్తున్న ఇసుక కొరత తీరేవరకు ఉచిత విధానం అమలుచేయాలని కోరుతూ వామపక్షాల నేతలు ఈనెల 13న ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు రూరల్‌లోని పొట్టేపాళెం నుంచి పెన్నాలోని ఇసుక రీచ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ, సిపిఎం నాయకులు సిహెచ్ ప్రభాకర్, మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇసుక విధానాన్ని అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పాలకుల అస్తవ్యస్థ విధానాల వల్ల భవన నిర్మాణరంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు ఆకలితో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికుల కుటుంబాలకు 10వేల రూపాయల వంతున ప్రభుత్వం ఆర్థికసాయం చేసి వారిని అప్పుల ఊబిలో నుంచి కాపాడాలని కోరారు. ఆకలితో ఆత్మహత్యలు చేసుకున్న కార్మికుల కుటుంబాలకు 25 లక్షల వంతున నష్ట పరిహారం అందజేయాలన్నారు. ఈ ఆందోళనలో మునీర్, షానవాజ్, పొట్టేపాళెం చంద్రమౌళి, ఆలూరు తిరుపాలు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి కృతజ్ఞతలు

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్‌లకు ప్రభుత్వం 10వేల రూపాయల వేతనం పెంచడంతో ఆర్‌పిలందరూ గురువారం నెల్లూరులోని ఎంసిఎస్ కళ్యాణ మండపంలో ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్‌లందరూ మంత్రిని సత్కరిస్తూ ఆయన ద్వారా సీఎంకు తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పి.రూప్‌కుమార్ యాదవ్, కర్తం ప్రతాప్‌రెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, ఓబిలి రవిచంద్ర, రంగా, వంగల శ్రీనివాసులురెడ్డి, మెప్మా పి.డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచస్థాయి వసతులతో...

# పురోగమిస్తున్న శ్రీసిటీ

## - థాయ్‌ల్యాండ్ కాన్సుల్ జనరల్ ప్రశంస



ప్రపంచస్థాయి అత్యుత్తమ మౌలిక వసతులతో పారిశ్రామికరంగంలో శ్రీసిటీ ఎంతగానో పురోగమిస్తోందని, థాయ్‌ల్యాండ్ పెట్టుబడిదారులకు ఇక్కడ వ్యాపార అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెన్నైలోని రాయల్ థాయ్‌ల్యాండ్ కాన్సుల్ జనరల్ నిటిరూజ్ ఫోన్‌ప్రపెర్ట్ కొనియాడారు. ఈనెల 14న ఆయన నలుగురు సీనియర్ అధికారుల బృందంతో కలసి శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా కాన్సుల్ జనరల్‌కు శ్రీసిటీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం స్వాగతం పలికి శ్రీసిటీ పరిశ్రమలు, పారిశ్రామిక ప్రగతిని గురించి వారికి వివరించారు. థాయ్ ఎస్ఎంఇల ద్వారా పెట్టుబడులు పెట్టగల వివిధ రంగాలను ఆయన కాన్సుల్ జనరల్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కాన్సుల్ జనరల్ మాట్లాడుతూ శ్రీసిటీలోని ప్రపంచస్థాయి వసతులు తమనెంతగానో ఆకట్టుకున్నాయని, పలు థాయ్ కంపెనీలు ఇక్కడకు తరలి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఆయన ఆఫీసు ఫర్నిచర్‌ను తయారుచేసి ఎగుమతి చేసే సెజ్‌లోని థాయ్‌ల్యాండ్‌కు చెందిన రాక్‌వర్త్ పరిశ్రమను సందర్శించి అక్కడి ఉత్పత్తి సామర్థ్యాలను గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

## 'ప్రభా'తం

# ఇది ప్రజా విజయం!



నవంబర్ 9వ తేదీన సుప్రీం తీర్పు కోసం దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూశారు. తీర్పువచ్చాక ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయోనని చాలామంది గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. భద్రతా బలగాలైతే కళ్లల్లో వత్తులేసుకుని పహారా కాశాయి. అయోధ్యలోని వివాదాస్పద భూమి రాముడిదేనని సుప్రీం కోర్టు స్పష్టంగా తీర్పునిచ్చింది. ఈ తీర్పు వచ్చిన తర్వాత కూడా దేశంలో ఎక్కడా ఒక్క చిన్న సంఘటన జరగలేదు. అయోధ్య రామజన్మభూమి వివాదానికి ఎంతో శాంతియుతంగా ముగింపు లభించింది.

ఇది ఒక చరిత్ర. ఒక మార్పుకు నాంది. భవిష్యత్ బంగారు భారతంపై ఆశలకు పునాది. సమాఖ్య భారతానికి, సమైక్య భారతానికి, సామరస్య భారతానికి, సహనశీల భారతానికి ఇది అంకురార్పణ.

దశాబ్దాలు కాదు శతాబ్దాల తరబడి హిందూ, ముస్లిం మతాల మధ్య సమస్యగా వున్న అయోధ్య రామజన్మభూమి వివాదానికి సర్వోన్నత న్యాయస్థానం తెరదించింది. దశాబ్దాల తరబడి సాగిన వాదోపవాదాలకు ముగింపు పలికింది. అయోధ్యలోని 2.77 ఎకరాల వివాదాస్పద స్థలం రామ్‌లల్లాకే దక్కుతుందని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పుచెప్పింది. ఈ కేసును భక్తివిశ్వాసాల కోణంలో చూడకుండా కేవలం సివిల్ వివాదంగానే విచారించామని, వివాదాస్పద స్థలంపై హక్కులు ఎవరివనేదే చూశామని, ఈ స్థలం బాబ్రీ మసీదుదే అని చెప్పడానికి తగిన ఆధారాలు లేవని, ఖాళీస్థలంలోనే మసీదును నిర్మించిన ఆనవాళ్ళు లేవని ఐదుగురు న్యాయమూర్తులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. బాబ్రీమసీదును కూల్చడాన్ని రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొన్న న్యాయమూర్తులు, మసీదు నిర్మాణానికి అయోధ్యలోనే 5ఎకరాల స్థలం కేటాయించాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించారు.

ఏళ్ల తరబడి సర్వోన్నత న్యాయస్థానంలో అయోధ్య వివాదంపై విచారణ సాగింది. నవంబర్ 9వ తేదీన అయోధ్యపై తుదితీర్పు వెలువడుతుందని ముందుగానే సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా రెడ్‌అలర్ట్ ప్రకటించారు. తీర్పు నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా అన్ని సమస్యాత్మక ప్రాంతాలలోనూ భారీ భద్రతా చర్యలు చేపట్టారు. అన్నింటికంటే ముందుగా సుప్రీంకోర్టు తీర్పు ఏదైనా స్వాగతిద్దామని, శాంతి సామరస్యాలతో మెలుగుదామని ప్రధాని నరేంద్ర మోడీ, ఆరెస్సెస్ చీఫ్ మోహన్‌భగవత్, కొందరు ముస్లిం మత పెద్దలు పిలుపునిచ్చారు. ప్రజలలో ఎక్కడా ఉద్రేకాలు రెచ్చగొట్టేలా ఏ వర్గం నాయకులూ మాట్లాడలేదు. నవంబర్ 9వ తేదీన సుప్రీం తీర్పు కోసం దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఉత్కంఠతో ఎదురుచూశారు. తీర్పువచ్చాక ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయోనని చాలామంది గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. భద్రతా బలగాలైతే కళ్లల్లో వత్తులేసుకుని పహారా కాశాయి.

నవంబర్ 9వ తేదీ ఉదయం 11గంటలకల్లా సుప్రీం తుది తీర్పు వెలువడింది. అయోధ్యలోని వివాదాస్పద భూమి రాముడిదేనని సుప్రీం కోర్టు స్పష్టంగా తీర్పునిచ్చింది. ఈ తీర్పు వచ్చిన తర్వాత కూడా దేశంలో ఎక్కడా ఒక్క చిన్నసంఘటన జరగలేదు. ఒక్క తూటా పేలలేదు... టియర్‌గ్యాస్ ప్రయోగాలు లేవు... అల్లర్లు లేవు... బంద్‌లు లేవు... కర్ఫ్యూలు లేవు... దేశంలో ఎంతో కాలంగా, ఎంతో జటిలమైన, ఎంతో కఠినమైన, మరెంతో వివాదాస్పదమైన అయోధ్య రామజన్మభూమి వివాదానికి ఎంతో శాంతియుతంగా ముగింపు లభించింది.

సుప్రీం తీర్పు అనంతరం ఇది ఒకరి విజయంగానో, ఇంకొకరి ఓటమిగానో చూడొద్దని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. కాని, అయోధ్యపై తీర్పు తర్వాత కూడా దేశంలో ఇలాంటి ప్రశాంత వాతావరణం వుండడం నిజంగా ప్రజల విజయమే. ముఖ్యంగా ముస్లింల విజయమనుకోవాలి. ఈ సంఘటన నేపథ్యంలో వారి సహనం, సంయమనం, తమ సోదరమతస్థుల విశ్వాసాల పట్ల చూపిన గౌరవం ఈ దేశ ప్రజలలో వారిపై వున్న అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేసింది. ముస్లింలను ఇంతకాలం ఒకే కోణంలో చూస్తూ వచ్చిన హిందువులు ఇప్పుడు వారిలోని రెండో కోణాన్ని చూడగలిగారు. అయోధ్య తీర్పును స్వాగతించడం ద్వారా ముస్లింలు ఈ దేశ ప్రజల మనసులు గెలుచుకున్నారు. ముఖ్యంగా ఈ స్థలంపై సుదీర్ఘకాలం పోరాటం చేసిన ముస్లిం పర్సనల్ లా బోర్డు సుప్రీం కోర్టు తీర్పు తర్వాత స్పందించిన తీరు మనసులను హత్తుకునేలా చేసింది. సుప్రీం తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ దేశంలో లౌకికవాదం కాపాడడానికి ఈ తీర్పు బాటలు వేస్తుందని ఆ బోర్డు పేర్కొనడం అభినందనీయం. అంతేకాదు, ఈ తీర్పుపై అప్పీలుకు కూడా వెళ్లేది లేదని చెప్పి వివాదాన్ని అక్కడితో ముగించారు.

దేశంలోని రాజకీయ పక్షాలన్నీ కూడా సుప్రీం తీర్పుపై సానుకూలంగా స్పందించాయి. వివాదానికి ముగింపు పలికినందుకు ఆనందించాయి.

అయోధ్యలో రాముడు పుట్టాడు, ఇక్కడనుండే రాజ్యమేలాడన్నది చారిత్రక సత్యం. ఈ దేశ ప్రజల విశ్వాసం. మహమ్మదీయులు దండెత్తి రావడం, హిందూ దేవాలయాలపై దాడులు చేయడం కూడా చరిత్ర చెప్పిన సత్యమే.

అయోధ్య అనే పేరు వింటే రాముడే గుర్తుకొస్తాడుగాని బాబర్‌కాదు. వేలఏళ్ల చరిత్రకు అయోధ్య సాక్ష్యం. ఈ దేశంలో కోట్లాది మంది ప్రజలు విశ్వసించే, ఆరాధించే రాముడికి ఆయన జన్మస్థానంలో గుడికట్టాలనుకోవడం ఈ దేశ సంస్కృతికి ప్రతీక.

గతంలో వున్న గుడిని కూల్చి బాబర్ కాలంలో మసీదును కట్టారన్నది అక్కడి తవ్వకాలలో బయటపడిన నిజం. ఈ పురావస్తు తవ్వకాలకు నేతృత్వం వహించింది కూడా మహమ్మద్ అనే మహనీయుడు. ఆయన సమర్పించిన చారిత్రక ఆధారాల వల్లే సుప్రీం కూడా ఇలాంటి తీర్పు ఇవ్వగలిగింది.

ఒకప్పుడు ఈ దేశంలో రాముడు, రామాయణం అద్భుత కల్పనలని కాంగ్రెస్‌పార్టీ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈరోజు అదే సుప్రీంకోర్టు రాముడున్నాడని చెప్పి కాంగ్రెస్ చెంప పగులగొట్టింది.

ఈ తీర్పు నేపథ్యంలో ఒక విషయాన్ని అందరూ గుర్తించాలి. దేశ రాజకీయాలలో అయోధ్య అంశం తెరకెక్కాకే కాంగ్రెస్ పతనం ప్రారంభం కాగా, బీజేపీ పరుగు మొదలైంది. ఈ దేశ రాజకీయ చరిత్రను ఇక నుండి చెప్పుకోవాలంటే... అయోధ్యకు ముందు... అయోధ్య వివాదం తర్వాత అని చెప్పుకోవచ్చు.

---

### కనువిందుగా

## బంగారు గరుడసేవ

నెల్లూరు పినాకినీ నదీ తీరాన ఉత్తర శ్రీరంగంగా కీర్తింపబడుతున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈనెల 9న చిలుక ద్వాదశిని పురస్కరించుకుని నిర్వహించిన బంగారు గరుడసేవ కనువిందుగా జరిగింది. ఉదయం ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిషింద సుదర్శనాచార్యులు రంగనాథునికి తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంప్రదాయంలో భాగంగా గోపురంవీధిలోని ఉత్తరాది మఠం రంగనాథుడు వేంచేయగా అక్కడ తులసి అమ్మవారికి తులసీ కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామివారి సేవలో మూడవ అదనపు జిల్లా జడ్జి శ్రీదేవి, రామారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

## హుండీ లెక్కింపు

శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం హుండీలను ఈ నెల 11వ తేదీన లెక్కించారు. జూలై 6 నుండి నవంబర్ 11వ తేదీ వరకు హుండీ కానుకల ద్వారా 12.28లక్షల ఆదాయం వచ్చింది. అలాగే హుండీలో 50 అమెరికన్ డాలర్లు కూడా లభించాయి. ఆలయ ఇ.ఓ వేమూరి గోపీ హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

## ఇంగ్లీష్ మీడియం.. తప్పేముంది!

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కొందరు తప్పుపడుతున్నారు. పచ్చమీడియా వ్యతిరేక కథనాలు రాస్తోంది. తెలుగుకు ఉరేస్తున్నారంటూ ప్రతిపక్ష నాయకులు శోకండాలు పెడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం పేదపిల్లలు మాత్రమే చదువుతున్నారు. అలాంటి వారికి ఇంగ్లీష్ మీడియం అక్కరలేదా? అసలు ఇంగ్లీషే వద్దనుకుంటే రాష్ట్రంలోనే ఇంగ్లీష్ మీడియంను ఎత్తేయాలి. తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన పి.నారాయణకు దేశ వ్యాప్తంగా వేలసంఖ్యలో పాఠశాలలు, కళాశాలలు వున్నాయి. ఏ ఒక్క పాఠశాలలో నన్నా ఆయన తెలుగుమీడియం అమలు చేస్తున్నారా? తెలుగుపై మొసలికన్నీళ్ళు కార్చే నాయకులెవరన్నా తమ బిడ్డలను ప్రభుత్వ బళ్లలో తెలుగుమీడియంలో చదివించారా? తెలుగు మాతృభాష. ప్రతి ఒక్కరూ దానిని నేర్చుకోవాల్సిందే! కాని, ఈరోజు ఉద్యోగ, వ్యాపారాలలో ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం ప్రధానమవుతోంది. కాబట్టి ఇంగ్లీష్ మీడియాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు.


**పి.నాగవల్లి, నెల్లూరు.**

## బదిలీ బాగాలేదు

సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్.వి.సుబ్రహ్మణ్యంను బదిలీ చేసిన పద్ధతి ఏ మాత్రం బాగాలేదు. ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి ఆయన వ్యవహారశైలి నచ్చకపోతే ఇంకో గౌరవప్రదమైన స్థానంకు పంపించొచ్చు. లేదా సెలవుపెట్టి వెళ్లి పొమ్మని వుండొచ్చు. అంతేగాని ఇంకో ఆరునెలల్లో రిటైర్డ్ కాబోయే సీనియర్ ఉన్నతాధికారిని ఒక ఆర్డీవో స్థాయి హోదాకు బదిలీ చేయడం సముచితమనిపించుకోదు. ఆయన బదిలీ జరిగిన తీరు, ఆయన బదిలీ అయ్యాడని చెప్పి క్రైస్తవ సంఘాల వాళ్ళు కేక్‌లు కోసుకుని సంబరాలు చేసుకోవడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం చూస్తే ఎల్‌వి సుబ్రహ్మణ్యం బదిలీ వెనుక క్రైస్తవ మాఫియా లాబీ పనిచేసిందేమోననే అనుమానాలు రాకమానవు. అంతేకాకుండా తనపై ఒక మతం ప్రభావం వుందన్న పచ్చమీడియా పుకార్లను వై.యస్.జగన్ నిజం చేసినట్లవుతుంది. ప్రతిపక్షంలో ఎలా వున్నా, ఇప్పుడు ఒక రాష్ట్ర సీఎంగా జగన్ ఆ పుకారుని నిజం చేసేలా ఈ బదిలీ జరగడం ఎంతైనా దారుణం.!

**సి.ప్రసాద్‌శర్మ, ఒంగోలు.**

## నరేంద్రమోడీకే చెల్లింది




అయోధ్య వివాదం ఎంతో జఠిలమైనది, దేశ వ్యాప్తంగా మత అల్లర్లకు కారణమైన వివాదం. ఎన్నో ప్రభుత్వాల కూల్చివేతకు కారణమైన సమస్య. ఇలాంటి సమస్యకు సామరస్య పరిష్కారం దొరుకుతుందా అన్న అనుమానం అందరిలో వుండేది. నిన్నటి సుప్రీంకోర్టు తీర్పు ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. దేశ ప్రధానమంత్రిగా సమర్థుడు వుంటే ఎంతటి జఠిలమైన సమస్య అయినా సాఫీగా పరిష్కారం అవుతుందన్న విషయం నిన్నటి సుప్రీం కోర్టు అయోధ్య తీర్పు తర్వాత నిజమైంది. ప్రధానిగా నరేంద్ర మోడీ వంటి సమర్థుడు వుండబట్టే ఆర్టికల్ 370, అయోధ్య వంటి పెద్ద వివాదాలు పరిష్కారమవుతున్నాయి.

**సి.రాజీవి, నెల్లూరు.**

## ముస్లిం సోదరులకు అభినందనలు

అయోధ్యపై సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఈ దేశంలో ముస్లింలు స్పందించిన తీరు అభినందనీయం. మత సామరస్యాన్ని చాటారు. తమ సోదర మతం పట్ల తమకున్న గౌరవభావాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా అయోధ్య తీర్పు విషయంలో ముస్లిం పర్సనల్ లా బోర్డు సానుకూలంగా స్పందించి ప్రకటనలు చేయడం హర్షణీయం. ఈ తీర్పు నేపథ్యంలో దేశంలో ఎక్కడా ఒక్క చిన్న సంఘటన కూడా జరగకపోవడం ప్రజల విజయమనే చెప్పాలి. **– కె.సుధాకర్, నెల్లూరు.**

## గులక పోశారు

ఇటీవల పత్రికల్లో నెల్లూరు రోడ్లపై పెద్దఎత్తున కథనాలు రావడంతో ప్రజాప్రతినిధులు స్పందించినట్లున్నారు. ఏదో కంటి తుడుపు చర్య అన్నట్లుగా గుంతల్లో గులక తెచ్చి పోశారు. దాని వల్ల ఇంకాస్త ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాహనాలు ఈ గులకపై వెళ్ళేటప్పుడు టైర్లకింద వున్న గులక ఎగిరి పక్కన వచ్చేవారిపై పడుతోంది. ఇది సమస్యను పెంచేదే తప్ప పరిష్కారం చేసేది కాదు. కనీసం ఆ గులకపై తారు కూడా పోయలేదు. మళ్ళీ వర్షం పడిందంటే రోడ్ల పరిస్థితి ఇంకా దారుణంగా తయారవుతుంది. ప్రజాప్రతినిధులు కంటి తుడుపు చర్యలపై కాకుండా, సమస్య పరిష్కారంపై శ్రద్ధ చూపితే బాగుంటుంది. **– జె.యస్.కృష్ణ, నెల్లూరు.**

### తిరుపతికి ప్రత్యామ్నాయ దారి...

# పట్టించుకునే వారేరి?



*నెల్లూరు నుండి తిరుపతికి వెళ్లాలంటే మనకున్న ప్రధానమార్గం జాతీయ రహదారి మీదుగా నాయుడుపేట వద్ద మలుపుతిరిగి శ్రీకాళహస్తి, రేణిగుంటల మీదుగా వెళ్లడమే! మనకు తిరుపతి అంటే అలవాటుండేది ఈ రూటే! తిరుపతి తర్వాత చిత్తూరు, కాణిపాకం, కంచి, బెంగుళూరులకు కూడా ఇదే ప్రధాన రహదారి!*

అయితే జాతీయ రహదారి మీదగాని, ఆ తర్వాత నాయుడుపేట, తిరుపతి రహదారిలోగాని రద్దీ విపరీతంగా వుంటుంది. వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ సంఖ్య ఏ స్థాయిలో పెరుగుతుందో చెప్పడానికి వెంకటాచలం, బూదనం టోల్‌గేట్ల వద్ద క్యూలో వున్న వాహనాలను చూస్తేనే అర్థమవుతుంది. ప్రతిరోజూ కొన్ని వందల సంఖ్యలో బస్సులు, కార్లు, ఇతర వాహనాలు ఈ మార్గంలోనే తిరుపతికి వెళ్తుంటాయి.


నెల్లూరు నుండి తిరుపతికి పొదలకూరు, రాపూరు, వెంకటగిరిల మీదుగా ప్రత్యామ్నాయ మార్గం కూడా వుంది. నెల్లూరు నుండి నాయుడుపేట మీదుగా తిరుపతికి ఎంత దూరం వుంటుందో, ఇంచుమించు ఈ మార్గం కూడా అంతే దూరం వుంటుంది. కాకపోతే ఈ మార్గంలో ప్రస్తుతానికి వాహనదారులకు వుండే ఇబ్బంది పొదలకూరు – రాపూరుల మధ్య రోడ్డు బాగా దెబ్బతినడం. ముఖ్యంగా రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా వున్నాయి. ఏర్పేడు వద్ద రైల్వేట్రాక్‌ను దాటాల్సి వుంటుంది. ఏర్పేడు వద్ద రైల్వేఓవర్ బ్రిడ్జిని నిర్మించాల్సి వుంది. ఇక నెల్లూరు, పొదలకూరురోడ్డు బాగానే వుంటుంది. రాపూరు – ఏర్పేడు మధ్య రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధిపరచి వున్నారు. ఈ మార్గంలో ఇబ్బంది లేదు. పొదలకూరు – రాపూరు మధ్య వున్న 30కిలోమీటర్ల రహదారిని విస్తరించడం, ఆధునీకరించడం చేస్తే తిరుపతికి వెళ్లే వాహనదారులకు ఇది ప్రత్యామ్నాయ మార్గమే కాదు, మెరుగైన మార్గం కూడా అవుతుంది. నాయుడుపేట రోడ్డుపై ట్రాఫిక్ తగ్గుతుంది. రేపు నాయుడుపేట, రేణిగుంటల మధ్య అరులైన్ల రహదారిని విస్తరించే క్రమంలో వాహనదారులకు ఈ మార్గం ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. కాబట్టి సంబంధిత ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని ఆలోచిస్తే మంచిది.

## అసెంబ్లీ కమిటీలలో నలుగురు నెల్లూరోళ్ళు

రాష్ట్ర శాసనసభ కమిటీలలో నెల్లూరుజిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు స్థానం దక్కింది. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని శాసనసభ రూల్స్ కమిటీ సభ్యుడిగా, శాసనసభ పిటిషన్స్ కమిటీ సభ్యుడిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని, రాష్ట్ర శాసనసభ ప్రివిలేజ్ కమిటీలో సభ్యుడిగా గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌ను నియమించారు.

### • రాంగ్‌రూట్‌లో 'షార్ట్'కట్

# జీవితం ఫట్...



## రంగుల ప్రపంచం మైకంలో మిగిలేది శోకమే

**"ఒక్క ఛాన్స్... ఒకే ఒక్క ఛాన్స్"... 'ఖడ్గం' సినిమాలో హీరోయిన్ సంగీత డైలాగ్ ఇది. సినిమా వేషాల కోసం హైదరాబాద్‌లో అడుగుపెట్టిన అమ్మాయిల జీవితాలు ఎలావుంటాయన్నది ఆ సినిమాలో పూర్తిగా కాకపోయినా, కొంత భాగం చూపించారు.**

ఈ ఒక్క ఛాన్స్ వల్లే... వెండితెరకు సావిత్రి, శ్రీదేవి, అంజలి, జయప్రద, జయసుధ, జయలలిత వంటి నటీమణులు పరిచయమయ్యారు. ఆ ఒక్క ఛాన్స్‌తోనే వాళ్ళు వెండితెరపై రంగుల ప్రపంచానికి ఎన్నో ఏళ్లపాటు మహారాణులుగా వెలిగారు. అయితే ఈ జీవితాలన్నీ తెరమీద కనిపిస్తాయి కాని, తెర మీద కనిపించనివి, తెరకెక్కలేనివి, తెరకెక్కని చీకటి కోణాలెన్నో ఈ 'ఒక్క ఛాన్స్' వెనుక దాగుంటాయి. ఒక్క ఛాన్స్ వస్తే సినిమాలలో రాణిద్దామని, వెండితెరపై తనను తాను హీరోయిన్‌గా చూసుకోవాలని చెప్పి, రంగుల ప్రపంచం మైకంలో హైదరాబాద్, చెన్నైలలో అడుగుపెట్టి, అడ్డమైన వాళ్ళు చెప్పిందంతా నమ్మి, వాళ్ళ చేతుల్లో అన్ని విధాలుగా మోసపోయిన ఎందరో అమాయక అమ్మాయిల జీవితాలు ఏ వెండితెరపైనా కనిపించవు.

బ్యాట్ పట్టుకున్న ప్రతి ఒక్కడూ సచిన్ టెండూల్కర్ కాలేడు. అలాగే కొంచెం అందం, ఇంకొంచెం నటన వుండే ప్రతి ఒక్కరూ హీరోయిన్‌లు కాలేరు. అయినా ఆ పిచ్చి ఎంత దాకా ముదిరిపోయిందంటే సినిమాలలో ఛాన్స్‌లు రాకపోతే టీవీ సీరియల్స్‌లో ఛాన్స్‌ల కోసం, అవి కూడా లేకపోతే చివరికి షార్ట్‌ఫిలింలలో అవకాశాల కోసం కూడా ఎగబడుతున్నారు. ఇలా అమ్మాయిలలో వున్న షార్ట్‌ఫిలింల పిచ్చినే ఓ ప్రబుద్ధుడు సొమ్ము చేసుకున్నాడు. షార్ట్‌ఫిలింలలో నటించే అవకాశం అంటూ ఎందరో అమ్మాయిలను బలవంతంగా వ్యభిచార రొంపిలోకి దించి వారి బ్రతుకులతో ఆడుకున్నాడు. నెల్లూరు పోలీసులు ఈ ముఠా గుట్టును రట్టు చేసి వివరాలు బయటపెట్టారు.

అల్లూరుకు చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ అలియాస్ మహేష్ డ్యాన్సర్‌గా వుంటూ షార్ట్‌ఫిలిం మేకర్‌గా, ఈవెంట్ ఆర్గనైజర్‌గా అవతారమెత్తాడు. నెల్లూరులో షార్ట్‌గన్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించాడు. తాను తీయబోయే షార్ట్ ఫిలింలలో నటిస్తే తర్వాత సీరియల్స్‌లో, సినిమాలలో అవకాశాలొస్తాయని అమ్మాయిలను నమ్మించాడు. షార్ట్‌ఫిలింల పేరుతో నెల్లూరు నగరంలో అక్కడక్కడా కొన్ని షాట్లు తీసేవాడు. అవకాశాల కోసం వచ్చిన అమ్మాయిలను కార్లలో తిప్పి లగ్జరీ లైఫ్‌కు అలవాటు చేసేవాడు. తర్వాత వారిని లోబరచుకుని వారితో సెక్స్ చేసినప్పుడు రహస్య కెమెరాల ద్వారా వాటిని చిత్రించేవాడు. తర్వాత ఆ అమ్మాయిలకు వాటిని చూపి భయపెట్టి వారి నుండి డబ్బులు గుంజేవాడు. డబ్బులు ఇవ్వని వారిని వ్యభిచార కూపంలోకి దించేవాడు. జాకీర్‌హుస్సేన్‌కు మీడియా ప్రతినిధి అని చెప్పుకునే ప్రియాంకతో పరిచయమైంది. వీరిద్దరూ కలిసి ఈవెంట్లు చేసేవాళ్ళు. హైదరాబాద్, కలకత్తా, బెంగుళూరుల నుండి యాంకర్‌లను పిలిపించేవాళ్ళు. వారిని ప్రోగ్రామ్‌లు అయిపోయాక విఐపిల వద్దకు పంపేవాళ్ళు. ఎక్కడైనా పోలీసుల నుండి తప్పించుకోవడానికి మీడియా ప్రతినిధిగా ప్రియాంక ఉపయోగపడేది. ఇలా వీరి వ్యవహారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతూ పక్క రాష్ట్రాలకు కూడా విస్తరించింది.

అయితే, ఇటీవల ఈ ముఠా అకృత్యాలకు బలైన కోవూరుకు చెందిన ఓ అమ్మాయి ఎస్పీకి దీనిపై చేసిన ఫిర్యాదుతో పోలీసు శాఖ అలర్ట్ అయ్యింది. ఎస్పీ దీనిని సీరియస్‌గా తీసుకుని టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగి పూర్తిస్థాయిలో విచారించి ఈ ముఠా చీకటి పనులను వెలుగులోకి తెచ్చారు. నిందితులను అరెస్ట్ చేశారు.

సమాజంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో బయటపడుతూనే వున్నా... 'స్క్రీన్'ల పిచ్చిలో కొంతమంది అమ్మాయిలు తమ జీవితాలను నాశనం చేసుకుంటూనే వున్నారు.



### ఎంత కసరత్తు చేసినా...

# ట్రాఫిక్‌తో సర్కసే!

*నెల్లూరు నగర ట్రాఫిక్.... ఎవరికీ అంతుబట్టని సమస్య. ఎవరికీ అర్థంకాని సమస్య. ఎవరు కూడా పరిష్కరించలేని సమస్య. ఈ ట్రాఫిక్‌లో వాహనం నడపడం కంటే కూడా సర్కస్‌లో వేలాడే తీగపై సైకిల్‌ను సులభంగా తొక్కవచ్చు.*

నెల్లూరుజిల్లాకు వచ్చిన ప్రతి ఎస్పీ కూడా నగరంలోని ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపినవాళ్ళే! ఈ ట్రాఫిక్‌ను సరిదిద్దడానికి కసరత్తు చేసినవాళ్ళే! కె.శ్రీనివాసరెడ్డి వంటివాళ్ళు కొంచెం మొండిగా పనిచేసి ఒకరకంగా దారికితెస్తే, ఇంకొందరు అధికారులు ఏవేవో మార్పులు చేసి, ఎన్ని చేసినా ట్రాఫిక్ చిక్కుముడులు వీడక చివరికి తమకెందుకొచ్చిన గోలలే అని చేతులెత్తేశారు.

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ రద్దీకి పెద్ద కారణాలేమీ లేవు. ఇక్కడ రెండు చక్రాలవి కాని, మూడుచక్రాలవికాని, నాలుగు చక్రాలవిగాని అన్నీ కలిపితే వున్న మనుషుల కంటే వాహనాలు ఎక్కువగా వుంటాయి. మధ్యతరగతి ఇళ్లకే రెండేసి స్కూటర్‌లు ఉంటున్నాయి. ఉన్నోళ్ళకైతే ఒకటి నుండి నాలుగైదు దాకా కార్లుంటున్నాయి. నగరంలో వుండే ప్రధాన రహదారులు నాలుగు. ఆత్మకూరు బస్టాండ్ నుండి

> *ఈమధ్య ఒక సంస్థ పరిశోధనలో ప్రజలలో ఎక్కువమందిలో బి.పి రావడానికి కారణాలలో ట్రాఫిక్‌లో వాహనాలు నడపడం కూడా ఒకటని చెప్పారు. నెల్లూరు ట్రాఫిక్‌లో అయితే ఈ కారణం ఇంకొంచెం ఎక్కువగానే వుంటుంది.*

మినీబైపాస్ మీదుగా అయ్యప్పగుడి, ట్రంకు రోడ్డు, పొదలకూరురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట రోడ్డు. నగరంలో దాదాపు 90శాతం ట్రాఫిక్ ఈ నాలుగురోడ్లమీదనే వుంటుంది. వందల సంఖ్యలో టౌన్‌బస్సులు, వేల సంఖ్యలో బైక్‌లు, ఆటోలు కార్లు... ఇన్నివేల వాహనాలకు ఈ రోడ్లు సరిపోతాయా?

నగరంలో ఆత్మకూరు బస్టాండ్, సుందరయ్య బొమ్మ, విఆర్‌సి, మద్రాసు బస్టాండ్, కెవిఆర్ పెట్రోల్‌బంకు, హరనాథపురం జంక్షన్, ప్రాంతాలలో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అడ్డదిడ్డంగా రోడ్ల మీదే వాహనాలు పార్కింగ్ చేయడం, ఆటోలను ఒక నిర్ణీత ప్రదేశంలో కాకుండా ఎక్కడపడితే అక్కడ ఆపుతుండడం, వాహనదారులు ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించకపోవడం, వన్‌వేలు అమలు చేయకపోవడం, ప్రధాన రోడ్ల పక్కనున్న వాణిజ్య భవనాలు, కళ్యాణ మండపాలకు పార్కింగ్ స్థలం లేకపోవడం, అక్కడికొచ్చిన వాహనాలను రోడ్ల పక్కనే పార్కింగ్ చేసి వెళుతుండడం.. వీటిలో చాలావాటికి పరిష్కారం లభించకపోవచ్చు. పార్కింగ్ లేదని హోటల్స్, కళ్యాణ మండపాలను మూసేయలేరు. వాహనాల సంఖ్యను తగ్గించలేరు. ఇప్పటికిప్పుడు రోడ్లను విస్తరించలేరు. చేయగలిగిందల్లా కొన్ని ఇరుకు రోడ్లను వన్‌వేలుగా చేయడం, ఆటోలు, బస్సులను నిర్ణీత ప్రాంతాల్లోనే నిలిపే ప్రయత్నం చేయడం. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా వున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ట్రాఫిక్ సిబ్బందిని ఎక్కువగా నియమించి కంట్రోల్ చేయడం. ఆటోలు, బస్సుల స్టాపింగ్ సెంటర్‌ల వద్ద వాటిని నిలిపేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయడం, 'యూటర్న్' విధానాన్ని ఎక్కువచోట్ల అమలు చేయడం... ఇలా కొన్ని కసరత్తులతో నెల్లూరు ట్రాఫిక్‌ను పూర్తిస్థాయిలో కాకున్నా కొంతవరకు పరిష్కరించవచ్చు.


ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## నెల్లూరు కబుర్లు

### బీజేపీ నేతలకు
# కోపమొచ్చింది



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడుతున్న సందర్భంగా ఇటీవల ఓ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపెద్ద నాయకుల పిల్లలు, మనవళ్ళు ఏ మీడియాలలో చదువుతున్నారంటూ భారత ఉప రాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు పేరును ఉటంకించాడు. దీనిపై జిల్లా బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 12వ తేదీ నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టి బీజేపీ నాయకులైన పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, ఎం.ఈశ్వరయ్య తదితరులు వెంకయ్యపై సీఎం వ్యాఖ్యలను ఖండించారు. రాజ్యాంగ పదవిలో వున్న వెంకయ్యనాయుడుపై ఇలా మాట్లాడడం తగదన్నారు. మాతృమూర్తి, మాతృభూమి, మాతృభాష గురించి వెంకయ్యనాయుడు ఎంతో గొప్పగా చెబుతుంటారని, అలాంటాయనను పట్టుకుని సీఎం ఇలా ఎట్లా మాట్లాడుతాడని వారు ప్రశ్నించారు.

## 'దేశం' సంస్థాగత ఎన్నికలు

తెలుగుదేశం పార్టీ జిల్లా స్థాయి సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఈ నెల 18 నుండి మొదలుకానుంది. 18నుండి గ్రామస్థాయి వార్డు స్థాయి ఎన్నికలుంటాయి. డిసెంబర్ 7 నుండి 23వతేదీ వరకు మండల పార్టీ, అనుబంధకమిటీల ఎన్నికలుంటాయి. ఈ ఎన్నికలకు సంబంధించి ఒకట్రెండు రోజుల్లో నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు.

## అప్రమత్తమైన పోలీసులు

ఈ నెల 8వ తేదీన అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వడం తెలిసిందే! ఈ తీర్పు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ భారీగా పోలీసు బందోబస్తును నిర్వహించింది. ప్రత్యేకించి మందిరాలవద్ద భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం ఎంతో కట్టుదిట్టంగా పనిచేయగా, తీర్పు వచ్చాక నెల్లూరుజిల్లా ప్రజలు కూడా ఎలాంటి స్పందనలకు లోనుకాకుండా హుందాగా వ్యవహరించి, పోలీసులకు సహకరించడం విశేషం.

## చెస్‌లో పృధ్వీరెడ్డి ప్రతిభ

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో జరిగిన జిల్లాస్థాయి రాపిడ్ చెస్ పోటీల్లో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారుడు వి.పృధ్వీరెడ్డి విజేతగా నిలిచి తన ప్రతిభను చాటుకున్నాడు. 5 రౌండ్లు సాగిన ఈ పోటీల్లో పృధ్వీరెడ్డి 4.5 పాయింట్లతో ప్రధమ స్థానం సాధించి చాంపియన్‌షిప్ షీల్డ్‌ను అందుకున్నాడు. ఈ పోటీల్లో పివి రామకృష్ణ, ఇ.మధుసూదన్, మధుసూదన్, కె.మనోజ్ తదుపరి స్థానాలు సాధించారు. విజేతలకు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, టోర్నీ నిర్వాహకుడు ఎస్.వెంకటేష్‌లు నగదు బహుమతులు అందజేశారు.



## ఉల్లి లొల్లి...

ఎర్రగడ్డల ధరలు ఇంకా మండుతూనే వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికి వీటి ధరలు యధాస్థితికి రావడం లేదు. మార్కెట్‌లో సన్నగడ్డలైతే కిలో 40రూపాయలు, పెద్దగడ్డలైతే 60రూపాయల దాకా వున్నాయి. పెరిగిన ఎర్రగడ్డల ధరల దెబ్బకు హోటళ్లలో వాళ్లు చపాతీలు, పుల్కాలలో ఇచ్చే ఎర్రగడ్డ ముక్కలను కూడా ఇవ్వడం లేదు. కొన్ని హోటల్స్, తోపుడుబండ్లు, మొబైల్ హోటల్స్‌లో ఆనియన్ దోసె, ఊతప్పం రేట్లను పెంచేశారు.

### డిఇఓ కార్యాలయానికి
## హంగులు

నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం అందానికి మెరుగులు దిద్దుతున్నారు. ప్రహరీపై సరస్వతీ తల్లితో పాటు మహనీయుల చిత్రాలను గీయిస్తున్నారు. ఈ చిత్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్ల చేత గీయిస్తుండడం విశేషం. అలాగే కార్యాలయం ఆవరణలో కొత్త నిర్మాణాలు చేపట్టారు. కార్యాలయంలో చెట్లు నాటి కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. మొత్తానికి డిఇఓ కార్యాలయాన్ని ఆకర్షణీయంగా మారుస్తున్నారు.

## విఓఏల సంబరం

విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(విఓఏ)ల వేతనాన్ని నెలకు 3వేల నుండి 10వేలకు పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో విఓఏలు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ నెల 11వ తేదీ నెల్లూరు కలెక్టరేట్‌లోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో కేక్‌ను కట్ చేసుకుని సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పి.డి సేనానాయక్, జిల్లా సమాఖ్య లీడర్‌లు, విఓఏలు పాల్గొన్నారు.

### ఆర్‌పిల ఆనందం

మెప్మా ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్‌ల వేతనాన్ని 2వేల నుండి 10వేలకు పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం జిల్లా వ్యాప్తంగా వున్న ఆర్‌పిలలో ఆనందం నింపింది. వారంతా సీఎంకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

## ఆక్టోపస్ మాంసం

ఇటీవలకాలంలో కార్పొరేషన్ హెల్త్ అధికారులు, ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున హోటళ్లలో తనిఖీలు నిర్వహించి వందలకిలోల కొద్ది కుళ్లిన నిల్వ మాంసాన్ని స్వాధీనం చేసుకోవడం తెలిసిందే! కొన్ని చోట్ల కల్తీ మాంసం గోడౌన్‌లే బయటపడ్డాయి. అయినా నగరంలోని పలు హోటళ్లలో ఇంకా మార్పురాలేదు. ఈనెల 11వ తేదీన అధికారులు మళ్లీ నగరంలో పలు హోటళ్ళు, ఫుడ్‌సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. ముత్తుకూరురోడ్డులో రెండు హోటళ్ళు, ఒక బార్‌లో తనిఖీలు నిర్వహించారు. అలాగే చిల్డ్రన్స్ పార్కు వద్ద ఇంకో హోటల్‌లో తనిఖీలు చేశారు. ఇక్కడ నిల్వ మాంసంతో పాటు సముద్రజీవి ఆక్టోపస్ మాంసాన్ని అమ్ముతున్నట్లు గుర్తించారు. అలాగే చిన్నబజారు, పెద్దబజారులలో హోల్‌సేల్ పండ్ల దుకాణాలను, కూల్‌డ్రింక్ షాపులను తనిఖీ చేశారు.

### జిల్లా ఉన్నతాధికారులను
## కలిసిన సంజీవయ్య



డిఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న సంజీవయ్య

సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య 11వ తేదీ నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.మల్లిఖార్జునను కలిశాడు. సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని తాగునీరు, సాగునీరు, రహదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించాడు. రహదారులు సరిగా లేక నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే డిఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లాడు.

ఆ తర్వాత ఎమ్మెల్యే ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్టీసీ ఆర్‌ఎం రామంను కలిశాడు. సూళ్లూరుపేట తీర ప్రాంతంలోని గ్రామాలకు పలు బస్సు సర్వీసులను రద్దు చేశారని, బస్సులు లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరాడు.

## అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లింపులు

అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారులకు బ్యాంకు ద్వారా చెల్లింపులు జరుగుతాయని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పీజే సుధా పేర్కొన్నారు. ఈనెల 9న జిల్లా కోర్టు ఆవరణంలోని సంస్థ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గతంలో తమ సంస్థ ద్వారా రూ.10 వేలు అంతకు లోపల డిపాజిట్ దారులు 24,389 మంది క్లైం చేసుకుని అర్హత పొంది ఉన్నారన్నారు. వారి ఖాతాలో రూ.16,91,73,443 జమ అయిందన్నారు. అందులో 2,559 మంది క్లైమ్‌లలో చిన్నచిన్న పొరపాట్లు ఉన్నాయని వాటిని సరిచేసి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### ఆంగ్ల మాధ్యమం
## అభినందనీయం

బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) సర్వసభ్య సమావేశం ఈనెల 9 న జరిగింది. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టడం అభినందనీయమని దీన్ని అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా చిన్ని వెంగయ్య, అధ్యక్షుడుగా శరత్ చంద్ర, ప్రధాన కార్యదర్శిగా వెంకటరావు, గౌరవ సలహాదారులుగా సురేష్ బాబు, బట్టు వెంకయ్య, నాగ భూషణం, రమేష్ ఎన్నికయ్యారు.

## పంచాయితీరాజ్ కార్యవర్గం

ఏపీ పంచాయితీరాజ్ నెల్లూరు జిల్లా ఇంజనీర్ల నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 9న జెడ్పీ కార్యాలయంలో ఫైనాన్స్ మేనేజర్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగాయి. అధ్యక్షులుగా పి.శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎన్.లక్ష్మీనారాయణ, ఒ.రమేష్, కార్యదర్శిగా ఎన్.బాబూరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎల్.హరిబాబు, ఆర్.వివేక్‌రెడ్డి, కోశాధికారిగా బి. వెంకటపతి, సాంకేతిక కార్యదర్శిగా ఎస్ ఎల్ వి ప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శిగా పీయస్ మునికుమార్ ఎన్నికయ్యారు.

### మురికిగుంటల్లో
## ఆయిల్‌బాల్స్

దోమల నివారణ కోసం నెల్లూరు 16వ డివిజన్‌లోని రాంజీనగర్ ప్రాంతంలోవున్న మురుగుకాలువలు, గుంటల్లో సోమవారం ఆయిల్‌బాల్స్ వదిలారు. 16వ డివిజన్ వైసిపి ఇన్‌ఛార్జ్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నగరాన్ని దోమలు లేకుండా చేయాలని, పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పాడు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బిజివేముల భాస్కర్‌రెడ్డి, విజయ రామిరెడ్డి, కాకాణి శేషారెడ్డి, బి.వెంకురెడ్డి, రాజారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'ఆపస్'కు
## కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం (ఆపస్) నూతన కార్యవర్గ సమావేశం ఈనెల 10న నెల్లూరులోని ఆ సంఘం కార్యాలయంలో జరిగింది. నూతన అధ్యక్షునిగా సూర్యనారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, ఆర్థిక కార్యదర్శిగా సుబ్బారావు, సంఘటన కార్యదర్శిగా అంకయ్యచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడు సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆపస్ ఎప్పటికప్పుడు పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ నేతలు టి.రమేష్‌బాబు, కెకె రాజగోపాలచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలకు
## వెబ్‌సైట్ ప్రారంభించాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకోవడం కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌లను ప్రారంభించాలని జిల్లా రజక సమాఖ్య అధ్యక్షులు వింజమూరు మస్తాన్‌బాబు ఒక ప్రకటనలో కోరాడు. రజకులు, నాయీబ్రాహ్మణుల కోసం ప్రభుత్వం ప్రకటించిన 10వేల ఆర్థిక సాయం కోసం ప్రభుత్వ అధికారుల నుండి సరైన గైడ్‌లైన్స్ లేక ఈ వృత్తుల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని, కాబట్టి ఈ పథకాలను ఉపయోగించుకునేందుకు వీలుగా ఇంటర్నెట్ వెబ్‌సైట్‌లు తెరవాలని ఆ ప్రకటనలో కోరాడు.

## తెలుగును ఖూనీ చేస్తున్నారు
### బాధపడ్డ హరిబాబు



తెలుగుభాషకు రాష్ట్రంలోనే పాడెకడుతున్నారని, మాతృభాషను మృతభాషగా మారుస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిహెచ్ హరిబాబు యాదవ్ బాధపడుతున్నాడు. ఇటీవల నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియంను ప్రవేశపెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టాడు. తెలుగుభాషను మన దేశంతో పాటు 12దేశాలలో బోధిస్తున్నారని, ఇంగ్లీషు మీడియం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు.

# స్వర్ణముఖికి గంగను తెప్పిస్తా!

**- నేదురుమల్లి రామ్**



స్వర్ణముఖి బ్యారేజ్‌కు తెలుగంగ నీళ్ళను తెప్పించి రబీ సీజన్‌లో కోట, వాకాడు మండలాల రైతులకు నీళ్లకు ఇబ్బంది లేకుండా చేస్తానని వైసిపి తిరుపతి, బాపట్ల లోక్‌సభ నియోజకవర్గాల పరిశీలకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల వాకాడులోని తన సొంత ఇంట్లో ఆయన ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులు, కోట, వాకాడు మండలాల వైసిపి నాయకులు, రైతులతో కలిసి సమీక్ష నిర్వహించారు. తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాద్‌రావు, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావులతో కలిసి పైస్థాయిలో మాట్లాడి తెలుగుగంగ నుండి స్వర్ణముఖి ద్వారా వాకాడు బ్యారేజీకి నిరంతరాయంగా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే విధంగా జి.ఓ తీసుకొస్తామన్నారు. స్వర్ణముఖి బ్యారేజీ కరకట్టరోడ్డును అందంగా తయారుచేస్తామని, వాకాడును ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దే క్రమంలో రహదారులను విస్తరించి సిమెంట్‌రోడ్లు వేయిస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో వైసిపి నాయకులు నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, కొడవలూరు దామోదర్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖరరెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఆర్అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు కుమార్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై...

# పెదవి విరిచిన కలెక్టర్



నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుందంటూ జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు పెదవి విరిచారు. 12వ తేదీన ఆయన నెల్లూరులోని స్టోన్ హౌస్‌పేట, నవాబుపేట, మైపాడుగేటు, ప్రశాంతి నగర్, జాఫర్‌సాహెబ్ కాలువ పక్కన పర్యటించారు. జాఫర్ సాహెబ్ కాలువ గబ్బుగబ్బుగా వుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రశాంతి నగర్‌లో ఓ సమోసాల షాపు ముందున్న చెత్తాచెదారాన్ని చూసి కలెక్టర్‌కు అరికాల్లో మండింది. నీ ఇంటినైతే ఇలాగే చెత్తచెత్తగా పెట్టుకుంటావా అంటూ ఆ షాపు యజమానిని మందలించారు. వెంటనే ఆ ప్రాంత శానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను పిలిచి గట్టిగా అక్షింతలు వేయడమేకాకుండా, అతనికి మెమో ఇవ్వాలని తన వెంటవున్న నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.యస్.మూర్తిని ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుందని, దీనిని మెరుగుపరచాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. అలాగే ఇటీవల వర్షాలకు దెబ్బతిని ప్రజలకు అసౌకర్యంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మత్తులు చేయాలని కూడా ఆదేశించారు. ఈ పర్యటనలో ఆయన వెంట కమిషనర్ పి.వి.వి.యస్.మూర్తి, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రెడీమేడ్ దుస్తులొచ్చాక..

# దర్జీలు దర్జాగా లేరు

**- ది టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ**



రెడీమేడ్ దుస్తులు మార్కెట్లో విరివిగా లభిస్తుండటంతో రాష్ట్రంలో చాలామంది దర్జీలు తమ ఉపాధి కోల్పోయి జీవనం కష్టతరమై పోయిందని టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ముచ్చటించిన మురళి, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్పయాత్రలో టైలర్స్‌కు ఏడాదికి పదివేల రూపాయలు ఇస్తానని, అది కూడా స్వంతంగా అంగడి కలిగినవారికే ఇస్తానని ప్రకటించారని, అలాకాకుండా ప్రతి టైలర్‌కీ పదివేల రూపాయలు చెల్లించి ఆదుకోవాలని అన్నారు. రాష్ట్రంలో పదకొండు లక్షలకుపైగా టైలర్లు వున్నారని, ఒక్క నెల్లూరుజిల్లాలోనే 40వేల మంది టైలర్లు వున్నారని, వీరంతా ఉపాధి లేక ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. టైలర్స్‌కి కూడా పెన్షన్స్‌తో పాటు 100 నుండి 150 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలని, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని మురళి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్ర అసోసియేషన్‌కి ఒంగోలుకు చెందిన కె.నాగేశ్వరరావు అధ్యక్షుడిగాను, నెల్లూరుకు చెందిన తాను ఉపాధ్యక్షుడిగాను ఇటీవలే నూతన కమిటీ ఏర్పడిందని చెప్పారు. మురళీతో పాటు ఆదిశేషయ్య, హజరత్, భరత్, శివాని శీనయ్య పాల్గొన్నారు.

## ఈ-చలానా చెల్లించని

# ఆటోలకు పోలీసుల బ్రేక్

పోలీసులు విధించిన ఈ-చలానాలు చెల్లించకుండా నెల్లూరు నగరంలో తిరుగుతున్న ఆటోలపై పోలీసులు పంజా విసిరారు. ఈనెల 12న రాత్రి నగరంలోని ఆటోలపై దాడులు నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ మల్లిఖార్జునరావు నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలు ఆటోలను సీజ్ చేశారు. నెల్లూరు నగరంలో నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి ప్రయాణీకులను తీసుకెళ్లడం, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా ఆటోలు నడపడం, నిషేధం ఉన్న గ్రామీణ ప్రాంత ఆటోలు నగరంలో తిరగడం వంటి పలు ఆటోలకు పోలీసులు ఈ-చలానాలు విధించారు. ఆయా చలానాలు చెల్లించకుండా పెండింగ్‌లో ఉండడంతో ట్రాఫిక్ డీఎస్పీ నగరంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను ఆపి తనిఖీ చేశారు. చలానాలు చెల్లించని దాదావు 150 ఆటోలను సీజ్‌చేసి సర్వోదయ కళాశాలకు తరలించారు. ఈ-చలానాలు చెల్లించి రశీదులు సమర్పిస్తేనే ఆటోలు రిలీజ్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కిడ్నాప్ కథ సుఖాంతం


- పసిబిడ్డను అపహరించిన మహిళల అరెస్ట్
- 36 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

***నవమాసాలు మోసి కన్న బిడ్డ ఒక్కసారిగా అపహరణకు గురైతే ఆ పసిబిడ్డ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. అయితే తమ బిడ్డను ఎవరో అపహరించడం, మళ్ళీ త్వరలోనే పోలీసులు ఆ బిడ్డను కిడ్నాప్ చేసిన వారిని పట్టుకుని, తల్లిదండ్రులకు బిడ్డను అప్పగించడంతో ఆ కిడ్నాప్ కథ ఎట్టకేలకు సుఖాంతమైంది.***

వివరాలిలా ఉన్నాయి... పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గోపి-కృష్ణవేణి అనే దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. ముగ్గురూ చిన్నపిల్లలే. నాలుగేళ్ళు, రెండేళ్ళ వయసున్న ఆ చిన్నారులతో పాటు రెండునెలల పసిబిడ్డ కూడా ఉంది. బెంగుళూరులో పనుల కోసం ఆ దంపతులు పిల్లలతో కలసి ఈనెల 5వతేది రాత్రి తణుకులో శేషాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. అదేసమయంలో తిరుపతికి చెందిన షేక్ బీబీ, నాగూర్‌బీ అదే రైలు ఎక్కారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు వెళ్తున్న ఆ దంపతుల పక్కనే కూర్చుని మాటామాటా కలిపారు. ముగ్గురు పిల్లల్ని ఎలా పెంచుతారు. మేం డబ్బులిస్తాం. మాకో బిడ్డని ఇవ్వండి అంటూ వారు బేరమాడేసరికి ఆ దంపతులు హడలిపోయి తమ బిడ్డల్ని ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పారు. అయితే, వారిలో ఒక బిడ్డను ఎలాగైనా తీసుకెళ్లాలని ఆ ఇద్దరు మహిళలు ప్లాన్ వేశారు. రైలు కావలి వద్దకు వచ్చేసరికి ఆ దంపతులు తమ పిల్లలతో నిద్రిస్తుండగా ఇదే సందనుకుని కావలిలో రైలు ఆగంగానే, బోగీలో చీరను ఊయలగా కట్టి పడుకునిబెట్టి ఉన్న రెండునెలల పసికందును ఎత్తుకుని రైలు దిగి చకచకా వెళ్ళిపోయారు. కాసేపటికి తల్లిదండ్రులు లేచి తమ పసిబిడ్డ కనిపించకపోయేసరికి పెద్దగా రోదిస్తూ నెల్లూరు రైల్వేస్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, నిఘా కెమెరాల ఫుటేజీలను పరిశీలించి కావలి రైల్వేస్టేషన్‌లో ఒక మహిళ చిన్నారిని తీసుకువెళ్ళడాన్ని గుర్తించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సెల్‌టవర్‌ల ఆధారంగా కూపీ లాగారు. కృష్ణా జిల్లాలోని నూజివీడులో తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉన్న నిందితులను పోలీసులు కనుగొని వెంటనే వెళ్ళి అరెస్ట్ చేశారు. చిన్నారిని కిడ్నాప్ చేసిన ఆ ఇద్దరు మహిళలను 36 గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకోవడం విశేషం. అంతేకాదు, ఈ ఇద్దరు మహిళలకు ఒక్కడే భర్త అని, ఆయన హైదరాబాద్‌లో ఉంటాడని పోలీసులు గుర్తించారు. తమకు పిల్లలు లేకపోవడంతో చిన్నారిని అపహరించినట్లు నిందితులు పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఏదేమైనా పసికందు కిడ్నాప్ కేసును వెంటనే ఛేదించేందుకు కృషిచేసిన నెల్లూరు సిఐ మంగారావు, ఒంగోలు సిఐ రామారావు, తదితర సిబ్బందిని రైల్వే డిఎస్పీ అభినందించి వారికి రివార్డులు ప్రకటించారు.

# శ్యామ్ సేవలు చిరస్మరణీయం

**- సంస్మరణ సభలో వక్తలు**



నెల్లూరులోని ప్రముఖ ఫోటోగ్రాఫర్, మెజీషియన్ కీర్తిశేషులు జి.శ్యామ్‌సుందర్ (ఉషా ఫోటో స్టూడియో కృష్ణమూర్తి మేనల్లుడు) సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఈనెల 9న నెల్లూరులోని టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో జరిగిన శ్యామ్ సంస్మరణసభలో నగరంలోని ప్రముఖ వైద్యులు డా.పి.మధుసూదన శాస్త్రి, డాక్టర్ పి.నరసింహాశాస్త్రి ముఖ్యఅతిథులుగా పాల్గొని శ్యామ్ సేవలను గుర్తుచేసుకున్నారు. శ్యామ్ తమతో ఎంతో ఆత్మీయంగా... కుటుంబసభ్యునిగా కలసిమెలసి ఉండేవారని, ఫోటోగ్రాఫర్‌గా, మెజీషియన్‌గా అందరికీ చిరపరిచితుడైన శ్యామ్ లయన్స్‌క్లబ్‌కు కూడా ఎంతో సేవచేశారని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మెజీషియన్ మాధవరావు, ఫోటోగ్రాఫర్, మెజీషియన్ మనోహర్, ఎన్ఆర్ కరెంట్, వినోద్‌కుమార్, కావలి రవిప్రకాష్, రాజమండ్రి శరత్‌చంద్ర, ఫోటోగ్రాఫర్ మోహన్‌రాజ్, ఉమామహేష్, మైమ్ రాజేంద్ర, హనుమంతరావు, ఆర్టిస్ట్ వి.జయంత్ అన్నాజీరావు, శ్యామ్ మేనల్లుడు శ్రీవత్స (బెంగుళూరు) తదితరులు పాల్గొని శ్యామ్‌కు నివాళులర్పించారు.

## 29న వీయస్‌యూ

# యూత్ ఫెస్ట్ సంబరాలు

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 2019 యూత్ ఫెస్ట్ సంబరాలను రావూస్ విద్యాసంస్థల సహకారంతో నిర్వహిస్తున్నట్లు వీయస్‌యూ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. ఈనెల 12 న వీయస్‌యూ యూత్‌ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈనెల 29న నెల్లూరు టౌన్‌హాలులో నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు సంగీతం, నృత్యం తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30వ తేది రావూస్ కళాశాల ఆడిటోరియంలో ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ అందే ప్రసాద్, రావూస్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వై.కోటేశ్వరరావు, డైరెక్టర్ వై.శివసంకేత్, సీఈవో ఎన్ శివారెడ్డి పాల్గొన్నారు.




# కల్యాణ వైభవం...!

## గాయత్రి - విరూపాక్షప్ప



దేశంలోనే ప్రతిష్టాత్మక ఎస్ఇజడ్‌గా పేరుపొందిన శ్రీసిటి జనరల్ మేనేజర్‌గా అందరికీ సుపరిచితుడు సన్యాసిరావు - శ్యామలల కుమార్తె **లక్ష్మీగాయత్రి - విరూపాక్షప్ప** (తిప్పడంపల్లి రామలింగం - రేణుకల కుమారుడు) ల పరిణయం నవంబర్ 7వ తేదీ హైదరాబాద్‌లో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

## అభిషేక్ - సవిత



నెల్లూరు డక్కన్ క్రానికల్ సీనియర్ కరస్పాండెంట్ పత్రి రాజశేఖర్ - భవానిల కుమారుడు **అభిషేక్ - సవిత** (హైదరాబాద్ శేరిలింగంపల్లి వాస్తవ్యులు భళ్ళముడి వెంకటసంగమేశ్వరప్రసాద్ - సత్యకళ్యాణిల కుమార్తె)ల కళ్యాణం ఈ నెల 10వ తేదీ హైదరాబాద్‌లోని ఉమాభవన్ ఫంక్షన్ హాల్ నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.

## హారికా - నికిత్



నెల్లూరు వాస్తవ్యులు తిక్కవరపు శ్రీనివాసులురెడ్డి - భ్రమతల కుమార్తె **హారికా రెడ్డి - నికిత్‌రెడ్డి** (చిత్తూరు వాస్తవ్యులు లక్ష్మీరెడ్డిపల్లె పూర్ణచంద్రారెడ్డి - మమతల కుమారుడు)ల వివాహం ఈ నెల 1వ తేదీ నెల్లూరు ధనలక్ష్మీపురంలోని కెజికె కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనెలు.

## ఆకాష్ - కిరణ్మయి



గూడూరు వాస్తవ్యులు బద్రి చంద్రయ్య - శ్రీలతల కుమారుడు **వీరభద్ర ఆకాష్‌వర్మ - కిరణ్మయి** (హైదరాబాద్ వాస్తవ్యులు గున్న జగన్నాధం - కాషమ్మల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 10వ తేదీ గూడూరులోని డాక్టర్ సిఆర్ రెడ్డి కళ్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. నవ వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



# గూడూరు డివిజన్ వార్తలు

'రైతు భరోసా'

## ప్రత్యేక స్పందనకు అర్జీల వెల్లువ



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ

భూమి కలిగిన ప్రతిరైతుకు ప్రభుత్వం అమలుచేస్తున్న వైయస్ఆర్ రైతు భరోసా పథకం ద్వారా నగదును అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు గూడూరు సబ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఈనెల 9న ఏర్పాటు చేసిన ప్రత్యేక రైతు భరోసా స్పందన కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాల రైతులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు అధికసంఖ్యలో వచ్చారు. గూడూరులో స్పందన కార్యక్రమం జరుగుతున్న తీరుతెన్నులపై సబ్ కలెక్టర్ రైతులతో మాట్లాడారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి రైతుకు నగదును చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లీలారాణి, ఎంపిడిఓ నాగమణి, ఏ.ఓ నాగమోహన్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు సమదుస్తులు పంపిణీ



గూడూరు మండలంలోని గొల్లపల్లి, నెర్నూరు, పుట్టంరాజువారి కండ్రిగ గ్రామాల్లోని అంగన్‌వాడీ చిన్నారులకు ఈనెల 11న సేవాభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పి.ఓ ఈశ్వరమ్మ మాట్లాడుతూ చిన్నారులకు దాతలు అందజేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి డి. వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్, ప్రతినిధి శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఫలసరుకులు



గూడూరు పట్టణంలోని మఠంవీధిలో ఉన్న రోటరీ భవనంలో ఈనెల 10న వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు పేదలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెలా ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా జరిపేందుకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు క్రిష్ణయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, దయాకర్‌రెడ్డి, మయూరి శ్యాం యాదవ్, హరిప్రసాద్, జీజీ నాయుడు, రవి, బల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నల ఆందోళన



ధర్నా చేస్తున్న రైతులు

గూడూరు తహశీల్దారు కార్యాలయం వద్ద గూడూరు, చిల్లకూరు మండలాల రైతులు ఈనెల 11న ఆందోళనకు దిగారు. చిల్లకూరు మండలంలోని కలవకొండ, ఉడతావారి పార్లపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు రద్దయిన 5 వందల ఎకరాల సిజెఎఫ్ఎస్ భూములకు డికెటి పట్టాలను అందించాలంటూ ఈ ఆందోళన చేపట్టారు. అనంతరం ఆ మేరకు తహశీల్దారుకు వినతులు సమర్పించారు. అదేవిధంగా గూడూరు మండలం తిరువెంగళాయపల్లి, చెమిర్తి, నెర్నూరు తదితర ప్రాంతాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ జీవనోపాధికి ప్రత్యామ్నాయం చూపాలని తహశీల్దారుకు వినతి పత్రాలు అందజేశారు.

## శివుని సన్నిధిలో 'హరి' అన్నదానం



గూడూరు పట్టణంలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కనుమూరు సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం కనుమూరు హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలందరూ మహాశివుని ఆశీస్సులు పొందాలని ప్రార్థించారు. మున్సిపల్ మాజీ అధ్యక్షురాలు పొణకా దేవసేన, వైకాపా నాయకులు కనుమూరు హరిచంద్రారెడ్డి, ఎమ్మెల్యే కుమారుడు నవీన్‌గుప్తా, నారాయణరెడ్డి, నరసరాజు ప్రవీణ్, పెంచలరెడ్డి, ఉదయభాస్కర్, శ్రీనివాసులు, చిరంజీవి, అనిల్ పాల్గొన్నారు.

# లోక్‌అదాలత్‌తోనే తొందరగా న్యాయం

సత్వర న్యాయం లోక్‌అదాలత్ ధ్యేయమని, మధ్యవర్తిత్వంతో ఇరు పక్షాల కక్షిదారుల కేసులను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా లోక్ అదాలత్ పనిచేస్తుందని నెల్లూరు నాల్గవ అదనపు జిల్లా జడ్జి ఎం.తిరుమలరావు పేర్కొన్నారు. ఈనెల 9న జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా భవనంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్వంలో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని పేదవారికి న్యాయాన్ని చేరువ చేసేందుకు న్యాయసేవాధికార సంస్థలు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పీజే సుధా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు ఉచితంగా న్యాయ సహాయాన్ని, సలహాలను న్యాయసేవాధికార సంస్థల నుంచి పొందవచ్చన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి జి.మల్లిఖార్జున, మహిళా పోలీస్ డీఎస్పీ శ్రీధర్, పలు కోర్టుల న్యాయమూర్తులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## జాతీయ బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన నెల్లూరు బాలలు

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో నెల్లూరు బాలలు తమ సత్తాచాటుకున్నారు. 33వ జాతీయ సబ్‌జూనియర్స్ బ్యాడ్మింటన్ యునెక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 10న భగల్పూర్‌లో జరిగాయి. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో బాలుర అండర్-13 విభాగంలో భార్గవ్‌రామ్, విశ్వతేజ రజత పతకం సాధించగా, బాలికల విభాగంలో దివిత కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పతకాలు అందుకున్న క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌ను అందరూ అభినందించారు.

# డెంగ్యూ జ్వరాలు

## ✸ ప్రజలు బెంబేలు

జిల్లాను డెంగ్యూ వ్యాధి వణికిస్తోంది. ఇటీవల వర్షాలు బాగా కురవడంతో వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలిపోయాయి. అనేక ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు విస్తరించాయి. దీంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. చెన్నైలోని ఆసుపత్రుల్లో నెల్లూరుజిల్లా వాసులు ఇద్దరు ఇటీవల చికిత్సపొందుతూ మృతిచెందారని సమాచారం. ఏఎస్‌పేట మండలం హసనాపురానికి చెందిన ఏడుకొండలు, కలువాయికి చెందిన మరో వ్యక్తి డెంగ్యూతో చికిత్స పొందుతూ మరణించారని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ సీజనల్‌వ్యాధుల పట్ల దృష్టిసారించి వ్యాధుల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కార్తీకం.. మహా మహిమాన్వితం

- బొగ్గరపు రాధాకృష్ణమూర్తి



కార్తీకమాసం మహా మహిమాన్వితమైనదని, చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలిసిన రోజే కార్తీకమని, ఈ మాసం అటు పరమేశ్వరుడు, ఇటు మహావిష్ణు పూజలకు ఎంతో ప్రీతిపాత్రమైనదని, ఈ మాసంలో ఆ భగవంతు నికి చేసే పూజలు శుభ ఫలితాలనిస్తాయని ప్రముఖ కవి, విశ్రాంత ఉపాధ్యాయుడు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి అన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మప్రచార పరిషత్, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన గుడి' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న 'కార్తీకమాసం విశిష్టత' అనే అంశంపై ఆయన ఆధ్యాత్మికోపన్యాసం చేస్తూ కార్తీకమాసం ఎంతో పుణ్యప్రదమైదని వివరించారు. కార్తీక శుద్ధ ఏకాదశి రోజున నెల్లూరులోని మూలాపేటలో కొలువైవున్న శ్రీ మూలస్థానేశ్వరాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి శివమాల ధరించిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్ ఘనంగా సత్కరించారు. టిటిడి ప్రోగ్రామ్ అసిస్టెంట్ దేవరాజులు పర్యవేక్షించారు.

# కలాం బ్యాగులో చంద్రబాబు ఫోటో!

శ్రీను గల్పిక

విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం. హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు విలేకరుల సమావేశం పెట్టాడు. తన 20-20 విజన్ గురించి చెబుతూ ఈ విజన్ కోసం అప్పట్లో అగ్రదేశాలు పోటీపడ్డాయని, కొన్ని లక్షల కోట్ల డాలర్లు ఇస్తామని బేరం పెట్టినా కూడా తాను ఎవరికీ ఇవ్వలేదని చెప్పాడు. ఎంతగానో బ్రతిమలాడాకే అబ్దుల్ కలాంకు తన విజన్ 20-20 గురించి చెప్పానని చెప్పి సమావేశం ముగించి ఇంటికి చేరుకున్నాడు. భువనేశ్వరీదేవి పెట్టిన రెండు పుల్కాలు తిని బెడ్‌రూంలోకి చేరుకున్నాడు. మంచంపై పడుకుని కొంచెం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లాడు. ఆయన కళ్ల ముందు.... బిల్‌క్లింటన్, బిల్‌గేట్స్, అబ్దుల్ కలాం, వాజ్‌పేయి... వంటి మహానేతలంతా గిర్రున తిరగసాగారు. వారితో తన జ్ఞాపకాలను ఆయన నెమరువేసుకుంటూ అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

అది స్వర్గలోకం రాజధాని అమరావతి. ఇంద్రుడు అప్పుడే తన రాజమందిరానికి తన వెహికల్ ఐరావత్ ఎక్స్‌యువి మీద వచ్చాడు. ఆయన సింహాసనంపై కొలువుదీరగానే పి.ఏ విశిష్టదేవ వుండి.. సార్, ఇక మొదలుపెట్టించమంటారా అని అడిగాడు. దానికి ఇంద్రుడు.... ఏం మొదలుపెడతావులే... ఆ రంభ, మేనక, ఊర్వశిల డ్యాన్స్‌లు చూసి చూసి రోజూ విసుగుపుడుతుందన్నాడు. అందుకు విశిష్టదేవ్... అయ్యో సార్, ఈరోజు ట్రెండ్ మార్చాము, భూలోకం నుండి వచ్చిన శ్రీదేవి, దివ్యభారతి, ఆర్తిఅగర్వాల్ వంటి భామలచే నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశాము. మీరు తిలకించి ఆనందించండి అని కోరాడు. ఇంద్రుడు సరేనని తలూపడంతో.. "జగదేక వీరుడు - అతిలోకసుందరి', 'యమగోల', 'యముడికి మొగుడు' వంటి చిత్రాలలోని కొన్ని పాటలకు వాళ్ళు నృత్యాలు చేసి సభను ఆనందడోలికల్లో ముంచెత్తారు. అంతలో ఒక భటుడు... ప్రభూ... ప్రభూ... అంటూ పరుగెత్తుకొచ్చాడు. ఏమైంది అని ఇంద్రుడు అతడిని అడిగాడు. దానికి ఆ భటుడు... ప్రభూ, మన కోశాగారంలో వుండాల్సిన పింక్ డైమండ్, బ్లూ డైమండ్, గ్రీన్ డైమండ్‌తో పాటు పలు వజ్రాల హారాలు మాయమయ్యాయి. వీటిని ఎవరో అపహరించినట్లుగా నా అనుమానం అని చెప్పాడు. నీకు ఎవరిపైనైనా అనుమానం వుందా అని ఇంద్రుడు ప్రశ్నించాడు. దానికి భటుడు... ఈమధ్య కాలంలో భూలోకం నుండి రాజకీయ నాయకులు ఎక్కువుగా వచ్చారు. వారిపైననే అనుమానంగా వుందని చెప్పాడు. అట్లాగైతే భూలోక రాజకీయ విఐపిలు వుంటున్న 'భారత్ బ్లాక్'లోని అందరి బ్యాగ్‌లనూ తనిఖీలు చేయండి అని ఇంద్రుడు ఆదేశించాడు. అంతే స్వర్గలోకం స్క్వాడ్రన్ టాస్క్‌ఫోర్స్ డాగ్ స్క్వాడ్‌తో రంగంలోకి దిగింది. నేరుగా 'భారత్ బ్లాక్' వద్దకెళ్లారు. ఆ బ్లాక్‌లో పి.వి.నరసింహారావు, చంద్రశేఖర్, వి.పి.సింగ్, జ్ఞానిజైల్ సింగ్, ఐ.కె.గుజ్రాల్, వాజ్‌పేయి, అబ్దుల్‌కలాం వంటి టాప్ విఐపిలున్నారు. స్క్వాడ్రన్ టాస్క్‌ఫోర్స్ వాళ్లు లోపలకొచ్చి అందరి బ్యాగ్‌లను తెరచి తనిఖీలు చేయసాగారు. డాగ్‌స్క్వాడ్ ఒక్కో బ్యాగ్ వద్దకెళ్లి వాసన చూసి ముందుకెళుతోంది. అక్కడ ఏం జరుగుతుందో తెలియక వాజ్‌పేయి ఒక భటుడిని పిలిచి... ఏమైందని అడిగాడు. అతను డైమండ్ల చోరీకి గురైన విషయాన్ని చెప్పి, వాటి కోసమే సోదాలు చేస్తున్నామన్నాడు. అంతలో డాగ్‌స్క్వాడ్ అబ్దుల్ కలాం బ్యాగ్‌ను వాసన చూసి అరవసాగింది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వెంటనే బ్యాగ్‌ను చేతుల్లోకి తీసుకుంది. ఈ బ్యాగ్‌లో వజ్రాలున్నాయా అని సిబ్బంది అడిగారు. అంతకంటే విలువైనది వుందని అబ్దుల్ కలాం చెప్పాడు. వెంటనే టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బ్యాగ్‌ను తెరిచారు. అందులో వారి చేతికి రెండు ఫ్యాంట్లు (అవి కూడా బొక్కలు పడివున్నాయి), రెండు చొక్కాలు, 2011 సంవత్సరంలో కొన్న రెండు కట్‌డ్రాయర్లు బయట పడ్డాయి. ఇంకా ఏమున్నాయో చూద్దామని సిబ్బంది బ్యాగ్ లోపలకు చేయిపెట్టి ఒక వస్తువును బయటకు తీశారు. ఆ వస్తువుకు పేపర్లు చుట్టి వున్నాయి. కలాం ఆతృతగా... ప్లీజ్ ప్లీజ్ దానిని తాకొద్దు. అదే నాకు స్ఫూర్తి... అదే నాకు వెలుగు అంటుండగా... అతను వెలుగు అంటున్నాడంటే ఖచ్చితంగా ఇందులో వజ్రాలుండుంటాయని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పేపర్ చించ సాగారు. కలాం వేగంగా పరుగెత్తి ఆ వస్తువును పట్టుకున్నాడు. ఆ వస్తువు కోసం ఇరువురూ పెనుగులాడుకోసాగారు. ఆ పెనుగు లాటలో పేపర్ పూర్తిగా చినిగిపోయి ఆ వస్తువు క్రిందపడింది. అప్పుడే అక్కడకు ఇంద్రుడు కూడా అడుగుపెట్టాడు. ఆ క్రిందపడిన వస్తువు వజ్రమో, వైడూర్యమో కాదు, హైటెక్‌రత్న మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటం. ఆ ఫోటోను చూసి ఇంద్రుడే కాదు, భూలోకం నుండి వెళ్లిన నాయకులు కూడా ఆశ్చర్యపోయారు. ఇంద్రుడు వుండి... ఈ ఫోటో ఎవరిది, ఎందుకంత జాగ్రత్తగా పెట్టుకు న్నారని ప్రశ్నించాడు. అందుకు కలాం... ఈ మహానుభావుడే నాకు స్ఫూర్తిదాత.. నాకు విజనరీని దానం చేసింది ఆయనే అని చెప్పాడు. దానికి ఇంద్రుడు కొంచెం అర్ధమయ్యేటట్లు చెప్పు అని అడిగాడు. అర్ధమయ్యేటట్లు చూపిస్తాను అంటూ కలాం అప్పటికప్పుడు అక్కడ ఒక ప్రొజెక్టర్, ఒక స్క్రీన్ ఏర్పాటు చేసి ఒక ఛాయాచిత్రాన్ని ప్రదర్శించసాగాడు.

★★★★★

అది తమిళనాడులోని రామేశ్వరం. చిన్నతనంలో అబ్దుల్‌కలాం... ఆకాశచువ్వను వెలిగించి పక్కకు వదులుతున్నాడు. అవి ఇళ్లల్లోకి, మనుషుల మీదకు పోతున్నాయి. తన తాతతో కలిసి రామేశ్వరం తీర్థయాత్రకొచ్చిన చంద్రబాబు నాయుడు ఈ సీన్ చూశాడు. వెంటనే కలాం దగ్గరకు వెళ్లి... ఆకాశచువ్వ ఇలా కాల్చకూడదు, నిటారుగా కాలిస్తే ఆకాశంలోకి పోతుంది అని కాల్చి చూపించాడు. దాంతో కలాం రామేశ్వరంలో దీపావళి ఆకాశచువ్వలను కాల్చిన స్ఫూర్తితో ఎస్ఎల్‌వి, పిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి రాకెట్లను ఎగరేసే స్థాయికి అంచలంచెలుగా ఎదిగాడు. అనతికాలంలోనే భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ఎదిగాడు. కలాం ఎప్పుడు రాకెట్ ఎగురవేస్తున్నా సెంటిమెంట్‌గా చంద్రబాబు ఫోటోను చూసి వెళ్లేవారు. శాస్త్రవేత్తగా కలాం ఎదిగేకొద్ది చంద్రబాబు కూడా రాజకీయ పరిణామక్రమంలో ఎదిగాడు. అలా ఎదిగి ఆయన ఏపికి సీఎంగా వుండేటైంలో వాజ్‌పేయి ప్రధానిగా వున్నారు. ఆ టైంలో రాష్ట్రపతి ఎన్నికలొచ్చాయి. ఎవరిని రాష్ట్రపతిని చేయాలనే అంశంపై బీజేపీ అగ్రనేతలంతా బుర్రలు బద్దలుకొట్టుకోసాగారు. అప్పుడు వాజ్‌పేయికి ఏదో ఆలోచన వచ్చి, టక్కున చంద్రబాబుకు ఫోన్ చేశాడు. చంద్రబాబు వెంటనే ఢిల్లీ పిఎంఓలో తేలాడు. రాష్ట్రపతిగా ఎవరిని చేస్తే బాగుంటుందని వాజ్‌పేయి అడిగాడు. చంద్రబాబు రెండో ఆలోచన లేకుండా టక్కున... ఇంకెవరు, కలాంకు సరితూగేదెవ్వరు అని అనేశాడు. దాంతో కలాం రాష్ట్రపతి కావడం జరిగిపోయింది.

రాష్ట్రపతిగా అబ్దుల్‌కలాం ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాష్ట్రపతిగా కలాం చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్నాడు. సాధారణంగా రాష్ట్రపతిగా అంతకుముందు ప్రమాణస్వీకారం చేసినోళ్లందరూ 'దైవసాక్షి'గా అని పలికేవాళ్ళు. కలాం మాత్రం 'చంద్రబాబు సాక్షిగా' అని ప్రమాణస్వీకారం చేయడంతో వాజ్‌పేయి, అద్వానీలతో సహా అందరూ నివ్వెరపోయారు. అక్కడేవున్న చంద్రబాబుకైతే... కలాం చూపిన అభిమానానికి కళ్లల్లో ఒకటే నీళ్ళు....

రాష్ట్రపతి పదవిలో అబ్దుల్‌కలాం అద్భుతంగా రాణిస్తున్నారు. అప్పుడే చంద్రబాబు విజన్ 20-20 గురించి ఆయనకు తెలిసింది. అమెరికా, రష్యా, జర్మనీ, జపాన్, చైనా వంటి అగ్రదేశాలు కూడా చంద్రబాబు విజన్ 20-20 గురించి ఆరాతీయసాగాయి. ఆ విజన్ దొరికితే తమ దేశాల స్వరూపం మారిపోతుందని వాళ్ళు భావించసాగారు. ఇంతటి ప్రాముఖ్యతగల చంద్రబాబు విజన్ గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం కలాంలో పెరిగింది. వెంటనే ఆయన ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు చేరుకున్నారు. నేరుగా చంద్రబాబు ఇంటికెళ్లారు. సడెన్‌గా ఇంటికొచ్చిన కలాంను చూసి... ఏం సార్, ఇలా వచ్చారని చంద్రబాబు అడిగాడు. మీ దగ్గర విజన్ 20-20 గురించి నేర్చుకోవాలనుకుంటున్నాను, దయచేసి నన్ను మీ శిష్యుడిగా స్వీకరించి ఆ విజన్ నేర్పించండి అని కోరాడు. దానికి చంద్రబాబు... ఇది నేనెంతో కష్టపడి రూపొందించిన విజనరీ సార్, నా ఫ్రెండ్ బిల్‌క్లింటన్ అడిగినా చెప్పలేదు. కాని, చిన్నప్పుడు మీకు ఆకాశచువ్వలు ఎలా కాల్చాలో నేర్పించాను, ఇప్పుడు ఈ వయసులో విజన్ 20-20 పై ట్రైనింగ్ ఇస్తాను అని చెప్పి విజనరీ గురించి అంతా వివరించాడు.

★★★★★

ఇక్కడితో తెరమీద దృశ్యాలు అయిపోయాయి. ఇంద్రుడు కన్నీళ్ల తుడుచుకుంటూ ఇలాంటి మహానాయకుడు... విజనరీ సృష్టికర్తను మీరు ఫోటోను పెట్టి పూజించడంలో తప్పేలేదు. ఇలాంటి సృష్టికర్త మా లోకంలో వుంటే ఈ లోకం ఇంకెంత బాగుపడుతుందో అని చెప్పాడు. కలాం అందుకు... భూలోకంలో ఆయన అవసరం ఇంకా చాలావుంది సార్, అమరావతిని ప్రపంచంలోని పాతిక నగరాల రూపంలో చేయాలన్నది ఆయన కల. ఆయనను ఇంకొన్నాళ్లు భూమిమీదే వుండనివ్వండి, తెలుగుజాతికి సేవ చేయనివ్వండి అని చెప్పాడు. కలాం తన పట్ల చూపిస్తున్న అభిమానానికి చంద్రబాబు.. థాంక్యూ కలాంజీ... థ్యాంక్యూ కలాంజీ అని అనసాగాడు. అప్పుడే ముఖం మీద నీళ్ళు పడ్డట్లుండడంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. ఎదురుగా చేతిలో చెంబుతో భువనేశ్వరీదేవి నిలబడి వుంది. ఏమైంది అని బాబు అడిగాడు. ఏంటి నిద్రలో కలాంజీ... అని కలవరిస్తున్నారని అడిగింది. చంద్రబాబుకు అప్పటికిగాని అర్ధం కాలేదు... అప్పటిదాకా తనకొచ్చిందంతా కల అని!

## కల్యాణ వైభవం...!

ప్రతాప్ - మౌనిక



విజంమూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్త గణపం వెంకటరమణారెడ్డి - సుధల కుమారుడు ప్రతాప్‌రెడ్డి - మౌనిక (కావలి వాస్తవ్యులు పూనూరు వెంకటసుధాకర్‌రెడ్డి - లక్ష్మిల కుమార్తె)ల వివాహం ఈ నెల 9వ తేదీ కావలిలోని ఎస్‌విఆర్ గార్డెన్స్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

# ఇసుక అక్రమ రవాణాపై కొరడా

**- ఎస్పీ ఐశ్వర్య రస్తోగి**



ఇసుక అక్రమ రవాణా నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఇసుక పాలసీ విధానాన్ని పక్కాగా అమలు చేస్తామన్నారు. ఇసుక అక్రమరవాణా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల సహకారంతో అక్రమ రవాణాపై దాడులు ముమ్మరం చేశాం. ఇసుక రీచ్‌ల వద్ద సి.సి.కెమెరాలు, చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశాం, వీటివద్ద రెవెన్యూ, పోలీస్, మైనింగ్ సిబ్బందిని నియమించాం. 24గంటలూ సిబ్బంది ఇక్కడ విధి నిర్వహణలో వుంటారు. ఇసుక రవాణా చేసే వాహనాల పత్రాలను, ఇసుక రవాణాకు రెవెన్యూ శాఖ జారీ చేసిన పత్రాలను వారు తనిఖీ చేస్తుంటారని ఆయన పేర్కొన్నారు. పక్క రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు ఇసుక అక్రమంగా తరలిపోకుండా కట్టడి చేసేందుకు అదనంగా స్పెషల్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. ఈ స్క్వాడ్‌కు స్థానిక పోలీసులు సహకరిస్తారన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపైన, అక్రమంగా ఇసుకను నిల్వచేసేవాళ్ల మీద క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మే నుండి ఇప్పటివరకు ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 258 వాహనాలను స్వాధీనం చేసుకుని, 13,19,486 రూపాయల జరిమానాలు వసూలు చేయడం జరిగిందన్నారు.

# వైభవంగా కార్తీక పౌర్ణమి

- దీపకాంతులతో శోభిల్లిన దేవాలయాలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



కార్తీక మాసంలో ముఖ్య పర్వదినమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 12న జిల్లా వ్యాప్తంగా అన్ని శైవ, వైష్ణవ క్షేత్రాల్లో దీపారాధన వేడుకలు వైభవంగా జరిగాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించి నోములు నోచుకున్నారు. నెల్లూరు మూలాపేటలో స్వయంభువుగా వేంచేసియున్న శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తైల బాండీలో భక్తులు చంద్ర దర్శనం చేసుకున్నారు. బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. స్వామివార్లకు పల్లకిసేవ, అనంతరం లక్ష్మీపార్వతి, సరస్వతి అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదాయపాళెం మహాత్మాగాంధీ నగర్‌లోని కృష్ణ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. జ్వాలాతోరణం, 108 దీపాలతో ప్రత్యే కంగా అలంకరించారు. మందిరంలో కొలువైన భవాని శంకర స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూలా పేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని సోమేశ్వరస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. దర్గామిట్ట రాంనగర్‌లోని శబరి శ్రీరామ క్షేత్రంలో సత్యనారాయణ వ్రతం, రాత్రి సామూహిక కార్తీక దీపోత్సవం, సీతారాముల కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొండాయపాళె రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో కార్తీక పౌర్ణమి దీపహారతులు (దామోదర వ్రతం) తులసి-సాలగ్రామ వివాహ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## వేడుకగా రంగనాధుని కల్యాణం

నెల్లూరు రంగనాయకులపేటలో పినాకినీ నదీ తీరాన ఉత్తర శ్రీరంగంగా కీర్తింపబడుతున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామివారి దేవస్థానంలో ఈనెల12న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథునికి ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. మహిళా భక్తులు పెన్నానదిలో కార్తీక దీపాలను వదిలారు. ఈ కార్యక్రమాల్లో ఇవోలు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో శివునికి వృషభ అర్చన



నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఆర్టీసీ ట్రైనింగ్ కాలేజీ ఎదురుగా గల అడవిలో వేంచేసియున్న శ్రీ దుర్గాభవాని సమేత అభయ లింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 12 న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం వృషభ అర్చన వైభవంగా జరిగింది. 501 ఆవుపాల కలశాలతో నందీశ్వరునికి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించిన అఖండజ్యోతి దర్శనంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు శీనయ్య, జగదీశ్వరరావు, రవికుమార్ తదితరులు పర్యవేక్షించారు.

గూడూరులో శ్రీ పాండు రంగ విఠలనాథస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఓంకార దీపంను వెలిగిస్తున్న ఆ దేవస్థానం కమిటీ సభ్యుడు నీలం రాజారెడ్డి



## నయనానందకరం.. నరసింహస్వామి కల్యాణం

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఇందుకూరుపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన స్వామివారి కల్యాణోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి కల్యాణవేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకటశేషాచార్యుల ఆధ్వర్యంలో, శ్రీకృష్ణ చరిత మానస ప్రచార మండలి పర్యవేక్షణలో, పట్నం వెంకటేశ్వర్లు దంపతుల ఉభయ కర్తృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

## ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక



వివరాలను తెలియజేస్తున్న ఎం.పి.ఆంజనేయులు

ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో డిసెంబర్ 15వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు నెల్లూరు రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ కళ్యాణ మండపంలో నెల్లూరు ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 30లోగా దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు 98490 93594, 9490012123, 94400 83892 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### ప్రభుత్వ ఉద్యోగులకు ఇకనుంచి..

## పనివత్తిడి నుంచి ప్రశాంతత

ప్రభుత్వ సెలవురోజుల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించబోమని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈనెల 13న ఏపిజెఏసి అమరావతి నాయకులు జేసీని కలిసి ప్రభుత్వ ఉద్యోగుల పనివత్తిడి విషయమై ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇకపై అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు రోజుల్లో ఎలాంటి సమావేశాలు కానీ, టెలికాన్ఫరెన్స్‌లు కానీ జరపబోమని హామీ ఇచ్చారని ఏపిజెఏసి నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పనివత్తిడి విషయంలో జేసీ సానుకూలంగా స్పందించడంతో సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో ఉండే ప్రభుత్వోద్యోగులకు సెలవు రోజుల్లో పనివత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండే అవకాశం వచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిజెఏసి అమరావతి జిల్లా ఛైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై. చెంచురామయ్య తదితరులున్నారు.

## మధుమేహంపై అవగాహన సదస్సు




ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఈనెల 14 నెల్లూరు ఏసీ స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు అధ్యక్షతన డా. మోహన్స్ డయాబిటీస్ స్పెషాలిటి సెంటర్లో సేవలందిస్తున్న డాక్టర్ ఇ.అనిల్‌కుమార్ సహకారంతో అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులందరికి బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ డయాబిటీస్ వ్యాధిని నివారించుకునేందుకు ప్రతి రోజు 40 నిమిషాలుపాటు నడక, మితాహారం, ఎండోక్రైనాలజిస్ట్ ప్రధానమైన ఆరోగ్య సలహాలు సూచనలు పాటిస్తే డయాబిటీస్ ను జయించవచ్చన్నారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేస్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎన్.సాయిసుబ్బారావు, జీవీ కృష్ణయ్య, చెంచయ్యనాయుడు, శివయ్య, ముసునూరు పిచ్చయ్య, వీరిశెట్టి హజరత్‌బాబు, రాఘవేంద్రశెట్టి, వేలూరు రంగారావు, డాక్టర్ సత్యనాథ్, బి.నాగరాజునాయక్ పాల్గొన్నారు.

## టీడీపీ అసంతృప్తులు..

# వైసిపి వైపా? బీజేపీ వైపా..?

ఒకప్పుడు అధికారపక్షమంటే అధికార పక్షమే... ప్రతిపక్షమంటే ప్రతిపక్షమే. అధికారం కోల్పోయాక ప్రతిపక్షంలో వుండాల్సి వచ్చినా ఎమ్మెల్యేలు కదిలేవాళ్ళు కాదు. ప్రతిపక్షంలో వుండాలంటే బాధపడేవాళ్ళు కాదు. అదొక బాధ్యతగా భావించేవాళ్ళు. ప్రతిపక్ష శాసనసభ్యులుగా తమదైన శైలిలో రాణించేవాళ్ళు. ఐదేళ్ళు కాదు, పదేళ్ళు, పాతికేళ్ళు ప్రతిపక్ష శాసనసభ్యులుగా కూడా వున్నోళ్ళున్నారు. అసలు శాసనసభ్యులుగా సుదీర్ఘకాలం పనిచేసి అధికారం రుచి ఎరుగని ఎంతో మంది నాయకులు మన రాష్ట్రంలోనే వున్నారు. ఇప్పుడు రాజకీయాలు అంత స్వచ్ఛంగా లేవు. ప్రతిపక్షంలో వుండడమంటే ఆసుపత్రి ఐసియులోని బెడ్‌మీద పడుకోవడమన్నంతగా బాధపడిపోతున్నారు. తాముంటున్న పార్టీ అధికారం కోల్పోయిందంటే.. అధికారంలోకి వచ్చిన పార్టీలోకి దూరడానికి దారులు వెదుక్కుంటుంటారు.

2014-2019ల మధ్య ఈ రాష్ట్ర రాజకీయాలలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. చంద్రబాబు ఒక దుష్ట సంస్కృతికి తెరతీశాడు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాడు. వైసిపికి చెందిన 23మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను కొనుగోలు చేశాడు. వీరిలో నలుగురికి మంత్రి పదవులు కూడా ఇచ్చాడు. అప్పుడు వైసిపి నుండి గెలిచిన ఎమ్మెల్యేల సంఖ్య 67, వారిలో 23మంది పార్టీ మారడమంటే అధికారం పిచ్చి ఏ స్థాయికి పోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పుడు రాష్ట్రంలో అధికారం మారింది. వైసిపి అధికార పక్షంలోకి, తెలుగుదేశం ప్రతిపక్షంలోకి వచ్చాయి. తెలుగుదేశం గెలిచింది 23 స్థానాలు. చంద్రబాబు చేసినట్లే జగన్ కూడా పార్టీ ఫిరాయింపులకు తెరతీస్తే తెలుగుదేశంలో గట్టిగా అయిదారు మంది కూడా మిగలరు. జగన్ అలా ఆహ్వానిస్తాడేమోనని చాలా మంది టీడీపీ ఎమ్మెల్యేలు ఆశపడుతున్నారు. కాని జగన్ అలాంటి నీచ రాజకీయాలు చేయడం లేదు. తన పార్టీలోకి రావాలంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామాలు చేయాల్సిందేనని షరతు పెట్టాడు. అంతేకాదు, ఉపఎన్నికల్లో వారికి కాకుండా అంతకుముందు వారి చేతిలో ఓడిపోయిన తమ పార్టీ వాళ్ళకు సీట్లిస్తానని, అందరూ కలిసి పనిచేసి వారిని గెలిపించుకురావాలని నిబంధన పెడుతున్నాడు.

ఇక్కడే వైసిపిలోకి రావాలనుకుంటున్న టిడిపి ఎమ్మెల్యేలకు బ్రేక్ పడుతోంది. ఇప్పుడంటే రాజీనామా చేస్తాం, ఎమ్మెల్సీ ఇస్తారు, మా నియోజకవర్గంలో ఇంకొకరు గెలుస్తారు, మళ్ళీ ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యేగా సీటు ఛాన్స్ వాళ్ళకే వుంటుంది కదా, వైసిపిలోకి వెళ్లడానికి నియోజకవర్గాన్ని వదులుకోవాలా అనే మీమాంసలో వున్నారు. ఈ నేపథ్యంలోనే ఇలాంటి వారికి బీజేపీ ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. కేంద్రంలో బీజేపీ అధికారంలో వుంది. ఒకవేళ రాష్ట్రంలో పనులు కాకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి తమపై ఒత్తిడి వుండదు. అదొక షెల్టర్ జోన్‌గా వుంటుంది. తాము చేసిన అక్రమాలను ఎక్కడ తిరగదోడతారోనని భయపడే టీడీపీ నాయకులు కొందరు బీజేపీలో చేరారు. ఇప్పుడు గంటా శ్రీనివాసరావు మరికొందరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలను వదులుకోవడం ఇష్టం లేక వైసిపికి ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది.

# భాషపై వ్యర్థ ప్రయాస

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు దీనిని వ్యతిరేకిస్తాయి. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టొద్దంటూ సీఎంకు లంచం ఆశ చూపుతారు. సీఎం వారిని గట్టిగా మందలిస్తాడు. థియేటర్‌లో ఈ సీన్ చూసిన ప్రతిఒక్కరూ చప్పట్లు కొట్టారు. మరి నేడు నిజ జీవితంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ అదే పని చేశాడు. మరి దీనిపై ఇంత రాద్ధాంతం ఎందుకు? ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినంత మాత్రాన తెలుగు సబ్జెక్ట్‌ను తీసేయలేదు. ప్రతి విద్యార్థి తెలుగు సబ్జెక్ట్‌ను నేర్చుకోవాల్సిందే! ఒకవేళ ప్రాంతీయ భాషల్లో ఉర్దూను ఒక ఆప్షన్‌గా పెట్టినప్పటికీ ముస్లింలు సైతం తెలుగును కాదని ఉర్దూ సబ్జెక్ట్‌ను ఎంచుకోరు. ఎందుకంటే స్కూల్ నుండి బయటకొచ్చాక వాళ్ళు ఎదురుపడే ప్రతి ఒక్కరితో మాట్లాడాల్సింది తెలుగులోనే! అంతెందుకు ఇప్పుడు నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యాసంస్థలనే తీసుకుందాం. అక్కడ క్లాసుల్లో బోధన ఇంగ్లీష్‌లోనే వుంటుంది. కాని, అక్కడి విద్యార్థులు తెలుగును మరచిపోయారా? ఎవరూ మరచిపోరు. అది మన వ్యవహారిక భాష... ఇంట్లో మాట్లాడాల్సిన భాష... భావాలని అందంగా పలికించే భాష... బ్రతుకు కోసమే ఆంగ్లం. బ్రతుకు అందంగా, ఆనందంగా వుండాలంటే కావాల్సింది ఆంధ్రమే!

### ఇంగ్లీష్ తప్పని సరైంది...

ఈరోజు ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారింది. ఇంగ్లీష్ గ్లోబల్ లాంగ్వేజ్‌గా మారింది. ప్రపంచంలోని అత్యధిక దేశాలలో ఇంగ్లీష్ అవసరం పెరిగింది. ముఖ్యంగా విదేశీ ఉద్యోగాల వేటలో ఇంగ్లీష్ భాష ప్రధానమైపోయింది. క్యాంపస్ ఇంటర్వ్యూలలోనే తెలుగు మీడియం చదువుతూ మధ్యలో ఇంగ్లీషు మీడియంలోకి వచ్చిన వారికంటే ఎల్‌కెజి నుండి ఇంగ్లీష్ మీడియంలో వున్నవారే సెలక్ట్ అయిపోతున్నారు. చైనీస్‌కు ఇంగ్లీష్ అంతగా రాదు. కాబట్టే మన వాళ్లకు అమెరికా సహా ఇతర దేశాలలో ఎక్కువగా అవకాశాలొస్తున్నాయి. చైనీయులు ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం సంపాదిస్తే మన అవకాశాలకు గండి కొడతారు. వాళ్లకు ఇంగ్లీష్ అబ్బకపోవడం మనకు మంచి అవకాశమనుకోవాలి.

### ప్రభుత్వ బడులే తెలుగును నిలబెట్టాలా?

ప్రభుత్వ బళ్లలో ఇంగ్లీష్ మీడియంను అమలు చేయగానే తెలుగు అంతమైపోతుందన్నట్లు కొందరు మేధావులు గగ్గోలు పెడుతున్నారు. మరి తెలుగును సజీవంగా వుంచాలంటే ప్రభుత్వ బడులే అందుకు వేదికకావాలా? తెలుగును ఉద్ధరించే బాధ్యత కార్పొరేట్ విద్యాసంస్థలకు లేదా? రాష్ట్రంలో వేలసంఖ్యలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలున్నాయి. ఏ ఒక్క దాంట్లోనైనా తెలుగు మీడియంలో విద్యాబోధన చేస్తున్నారా? చేయరు. తెలుగు మీడియం అంటే తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను చేర్పించరు. ఇతర విద్యాసంస్థలతో పోటీని తట్టుకోలేరు. ఈరోజు రిక్షా కార్మికుడు సైతం తన బిడ్డను ప్రభుత్వ బడిలో కాకుండా, వేలకు వేలు ఫీజులు కట్టి కార్పొరేట్ స్కూల్‌లో చేరుస్తున్నాడంటే కారణం... అక్కడ ఇంగ్లీష్ మీడియం ఉండడం. ఆ మీడియంలో చదివితే ఉపాధి అవకాశాలు ఎక్కువగా వుంటాయనే నమ్మకం.

### భక్తికి మాతృభాష... భుక్తికి ఆంగ్ల భాష..

ఇంగ్లీష్ మీడియంలో చదివినంత మాత్రాన తెలుగు భాషను మరచిపోతామనుకోవడం అవివేకం. ఒకరోజు ఎదురింట్లో వున్న తల్లి అన్నం పెట్టిందని రోజూ అన్నం పెట్టే అమ్మను మరచిపోం కదా! ఒక మనిషి బ్రతుకుదెరువు పోరాటంలో ఎన్నో విద్యలు నేర్చుకుంటుంటాడు. అలాంటి వాటిలో భాష కూడా ఒకటనుకోవాలి. ఈరోజు ఇంగ్లీష్ నేర్చుకోవాలనుకుంటున్నారంటే దానిపై ప్రేమ, భక్తి పుట్టి కాదు, దానివల్ల బ్రతుకుదెరువు ఉండబట్టి.

### ఆరంభంలో అగచాట్లే!

ప్రభుత్వ బడుల్లో వచ్చే ఏడాది ఒకటి నుండి ఆరో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఒక్కో ఏడాది ఒక్కో తరగతికి విస్తరించుకుంటూపోతారు. నిర్ణయం బాగానే వుంది. కాకపోతే అమలులో కొన్ని ఇబ్బందులు తప్పకపోవచ్చు. ముఖ్యంగా బోధనా సిబ్బంది సమస్య రావచ్చు. ఇంత వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుమీడియం ఉపాధ్యాయులే వున్నారు. వారందరినీ ఒక్కసారిగా ఇంగ్లీష్ మీడియంలో సబ్జెక్ట్ బోధన చేయమంటే కష్టమవుతుంది. అలాగని వారిని తొలగించలేరు. ఇంగ్లీష్ మీడియం ఉపాధ్యాయులను ఇప్పటికిప్పుడు నియమించలేరు. ఈ సమస్యలను ప్రభుత్వం అధిగమించాల్సి వుంది.

### తెలుగు మీడియం కూడా ఉండాల్సిందే!

అయితే ప్రభుత్వ బడుల్లో పూర్తిగా తెలుగుమీడియం ఎత్తేయడం మంచిది కాదు. ప్రతి మండలంలో తెలుగు మీడియంలో తెలుగుమీడియంలో చదువుకోవాలనుకునే వారికి ఆ మీడియంలో బోధన చేసేలా పాఠశాలలను అందుబాటులో వుంచాలి. ఎందుకంటే ప్రతిఒక్కరూ విదేశాల ఉద్యోగాల ఊహాలతో చదవరు. చదివే ప్రతివందమందిలో ఏ పది, పాతిక మందికో విదేశాలలో లేదా విదేశీ కంపెనీలలో ఉద్యోగాలొస్తుంటాయి. అందరికీ ఇంగ్లీష్ అంత తొందరగా ఎక్కదు. అందరి మేధస్సు ఒకేలా వుండదు. కొందరు తెలుగులో బోధిస్తేనే అన్ని సబ్జెక్టులను అర్థం చేసుకోగలరు. సబ్జెక్టులు తెలుగులో వుంటే వీళ్లు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుల దాకానన్నా రాగలరు. అలాకాకుండా ఆరంభం నుండే ఇంగ్లీషులో సైన్స్, సోషల్, గణితం పాఠాలు చెప్పసాగితే, వారి తలకు అది ఎక్కకపోగా, ఆ చదువు భారంగా మారి వాళ్ళు ఎలిమెంటరీ స్కూల్ దశలోనే చదువులకు స్వస్తి పలికే ప్రమాదం వుంది. కాబట్టి ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు కనీసం కొన్ని పాఠశాలల వరకైనా తెలుగుమీడియం బోధనను కేటాయించాల్సివుంది.

ఇటీవల హిందీని జాతీయ భాషగా చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన ప్రకటనపై కొన్ని దక్షిణాది ప్రాంతీయ సంఘాలు, నేతలు మండిపడ్డారు. హిందీని నేర్చుకోవడంలో తప్పేముంది. దేశంలోని అత్యధిక రాష్ట్రాలలో హిందీ వాడుక భాషగా వుంది. హిందీ నేర్చుకుంటే ఏ రాష్ట్రంలో ఉద్యోగం చేయాలన్నా వ్యవహారశైలి సులభమవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక విద్యార్థి తాను పుట్టిన వూరిలోనే పూర్తికాలం వుంటాడన్న నమ్మకం లేదు. ఉపాధి కోసం కన్నతల్లిని, ఉన్న వూరిని వదిలి పక్కరాష్ట్రాలకు, ఇతర దేశాలకు వెళ్లి ఇక్కడే వుండాల్సిన పరిస్థితి. కాబట్టి బ్రతుకు కోసం, కడుపు నింపే మెతుకు కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా ఫర్వాలేదు. అవన్నీ బ్రతుకుదెరువు మార్గాలు. కాని, సొంత భాషను మరచిపోకుంటే చాలు. ఎందుకంటే మన బ్రతుకు మొదలైందే అమ్మ భాషతో కాబట్టి...!

## యురేనియం తవ్వకాలు

# మానవ మనుగడకు ముప్పు

యురేనియం తవ్వకాల వల్ల ప్రజలకు, పర్యావరణానికి ముప్పు కలుగుతుందని, వెంటనే ఈ ప్రయత్నాలను నిలుపుదల చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవి రమణయ్య పిలుపునిచ్చారు. అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో ఈనెల 10న ఆయన పర్యటించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామసమీపంలో ఈ తవ్వకాల వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయని, కేంద్రప్రభుత్వం వెంటనే ఈ యురేనియం తవ్వకాలను విరమించుకోవాలని కోరారు. జేవివి నాయకులు కామయ్య, పెంచలయ్య, వేణు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సంచలనాల సారథి

(మొదటి పేజీ తరువాయి)

నిజంగా దేశాన్ని ఏలిన పై నాయకులందరితో పోల్చి చూస్తే నరేంద్ర మోడీకి ప్రత్యేకతలు ఏమీ లేవు. వారందరితో పోల్చి చూస్తే రాజకీయ విజ్ఞతలో గాని, పరిణితిలోగాని, కుటుంబ నేపథ్యంలో గాని నరేంద్ర మోడీ అట్టడుగునే వుంటాడు. కాని, దేశాన్ని దశాబ్దాల పాటూ పట్టి పీడిస్తున్న సమస్యలను పరిష్కరించడంలో మాత్రం ముందున్నాడు. ఇంతకాలం ఏ ప్రధాని కూడా వాటిని కదిలించడానికి కాదు, వాటివైపు కన్నెత్తి చూడటానికి కూడా సాహసించని సమస్యలను నరేంద్ర మోడీ ఒంటి చేత్తో కంటి చూపుతో పరిష్క రించుకుంటూ పోతున్నాడు.

తాముండగా అయోధ్య రామజన్మభూమి వివాదం పరిష్కారమవుతుందని ఈ తరంవాళ్ళు కలలో కూడా వూహించలేదు. అసలు సుప్రీంకోర్టులో రామజన్మభూమికి అనుకూలంగా తీర్పు వస్తుందని, ముస్లింలు దానిని ఆమోదిస్తారని ఎవ్వరూ అనుకోలేదు. నరేంద్ర మోడీ పాలనలో అది సాధ్యమైంది. రాముడు జన్మస్థానంలో రామమందిరం కట్టాలన్న కోట్లాదిమంది భక్తుల స్వప్నం సాకారమైంది. ఇది నరేంద్ర మోడీ సమర్ధవంతమైన పాలనతోనే సాధ్యమైంది. రాజ్యాంగ పరిధిలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వ జోక్యం లేకుంటే ఇలాంటి తీర్పు వచ్చేదికాదు. దేశంలో ఇంతటి ప్రశాంత వాతావరణముండేది కాదు. కేంద్రంలో బీజేపీ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వమే వుండుంటే... రామజన్మభూమికి అనుకూలంగా తీర్పు వచ్చేది కాదు. వచ్చినా కాంగ్రెస్ నాయకులు దేశాన్ని ప్రశాంతంగా వుండనిచ్చేవాళ్లు కాదు. మైనార్టీలను వాళ్లే రెచ్చగొట్టుండేవాళ్ళు. అయోధ్య సమస్య అన్నది ఈనాటిది కాదు. బ్రిటీష్ కాలం నుండి ఈ వివాదం నడుస్తూనే వుంది. ఈ సమస్య కోసం ఎన్నో కోట్లు ఖర్చు చేశారు, ఎన్నో ప్రాణాలు పోయాయి. ఈరోజు ఖర్చు లేకుండా, ప్రాణ నష్టం లేకుండా ఎంతో ప్రశాంతంగా సమస్యకు ముగింపు పలికారు.

జమ్మూ - కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని, విశేషాధికారాలను కల్పించే ఆర్టికల్ 370ని, 35ను ఎత్తేయడానికి ఏ ప్రధాని సాహసించలేదు. కనీసం దాని గురించి కూడా ఆలోచించ లేదు. ఆర్టికల్ 370ని తొలగిస్తే దేశం అల్లకల్లోలమైపోతుందన్నట్లుగా భయపడ్డారు. దేశానికి ఇంతవరకు 13మంది ప్రధానులుగా పనిచేసినా వాళ్లెవరూ ఆర్టికల్ 370ని తొలగించే దిశగా ప్రయత్నం చేయలేదు. నరేంద్ర మోడీ చాలా సింపుల్‌గా, ఎటువంటి అల్లర్లు లేకుండా 370ని తొలగించి పడేశారు.

ప్రధానిగా నరేంద్ర మోడీ తన తొలి ఐదేళ్ల పాలనా కాలంలో నోట్ల రద్దు, జిఎస్టీ వంటి ఆర్థిక సంచలనాలతో పాటు ఉగ్రవాద చర్యలకు ఘాటుగానే కౌంటర్‌లిచ్చాడు. పఠాన్‌కోట్, పుల్వామా దాడులకు ప్రతీకార చర్యలు ఘాటుగానే చూపించాడు. ప్రపంచంలో భారత్‌కున్న ఏకైక శత్రుదేశం పాకిస్థాన్‌ను ఏ స్థాయిలో దెబ్బకొట్టాలో ఆ స్థాయిలో కొట్టాడు. విదేశాంగ విధానంలో అద్భుత విజయాలు సాధించాడు.

ఈ యేడాది ఎన్నికల ఫలితాల తర్వాత రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టగానే దేశాన్ని పట్టిపీడిస్తున్న శాశ్వత సమస్యలకు చికిత్స మొదలుపెట్టాడు. ఇక ఈ నాలుగున్నరేళ్ల కాలంలోనే మోడీ ద్వారా రిజర్వేషన్‌ల విధానంలో మార్పులు, అలాగే ఒకే దేశం, ఒకే చట్టం వంటివి కూడా అమలయ్యే అవకాశముంది. అంతేకాదు, కాలం కలిసొస్తే ఈ దేశ పార్లమెంటరీ ఎన్నికల విధానాన్ని మార్చినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.



*భారత దేశ ఎన్నికల చరిత్రలో తనదంటూ చెరగని ముద్ర వేసుకున్న భారత ఎన్నికల సంఘం మాజీ చీఫ్ కమిషనర్ తిరునెల్లయి నారాయణ అయ్యర్ శేషన్(టిఎన్ శేషన్) ఈనెల 10వతేది రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో దేశం ఒక గొప్ప ఎన్నికల సంస్కర్తను కోల్పోయినట్లయింది. ఎన్నికల కమిషన్ అంటే ఏంటో.. దాని పవర్ ఏమిటో తెలియజెప్పిన అత్యంత కఠినమైన.. నిఖార్సయిన ఎన్నికల అధికారి టిఎన్ శేషన్ 87ఏళ్ళ వయసులో వృద్ధాప్య సమస్యలతో చెన్నైలో కన్నుమూశారు.*

# చండ 'శేషన్'.. ఇక లేరు

ఆయన ఎన్నికల అధికారిగా వచ్చేదాకా దేశంలో ఎన్నికల సంఘమంటూ ఒకటుందని ఎవరికీ పెద్దగా తెలిసేది కాదు. అయితే, భారత ఎన్నికల కమిషన్ అంటే ఏమిటో, అది ఎలా ఉండాలో.. దానికి ఎంత పవర్ ఉంటుందో ఆయన వచ్చాకే దేశంలో అందరికీ తెలిసింది. ఆయనెవరో కాదు.. ఆయనే శేషన్!.. టిఎన్ శేషన్!... నీతి నిజాయితీలకు, నిర్భీతికి ఆయన ప్రతీక. పట్టుదలకు, క్రమశిక్షణకు ఆయనో నిలువెత్తు పతాక. కేరళలోని పాలక్కాడ్ జల్లాలలోని తిరునెళ్ళాయిలో 1932లో జన్మించిన శేషన్ తమిళనాడు కేడర్ నుంచి 1955 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా, ఆ తర్వాత కేంద్రంలో 18వ కేబినెట్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. 1990 డిసెంబరు 12 నుంచి 1996 డిసెంబరు 11 వరకు ఆరేళ్లపాటు ఆయన చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా పనిచేసి భారత ఎన్నికల కమిషన్‌కే మంచి గుర్తింపు తెచ్చిన సిన్సియర్ ఆఫీసర్..శేషన్!..

### శేషన్ అంటే చండశాసనుడే :

అప్పట్లో ఎన్నికల నిబంధనలు పెద్దగా పట్టించుకునే పరిస్థితి లేకపోవడం, ధనం, కండబలం ఉన్నవారిదే పైచేయి అవుతుండడం గమనించిన శేషన్ ఎవరైనా సరే ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలంటూ ఉత్తర్వులు జారీచేయడమే కాక, నిబంధనలు తు.చ తప్పకుండా అమలుచేయించాడు. చట్టాన్ని కానీ, ఎన్నికల నిబంధనలు కానీ ఎవరైనా అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామనే శేషన్ చేసిన సింహగర్జన దేశ వ్యాప్తంగా మార్మోగింది. ఎన్నికల విషయంలో ఎక్కడ లోపం జరిగినా శేషన్ సహించేవారు కాదు. శేషన్ దెబ్బకు దేశంలోని నాయకులు, అధికారులు కూడా భయపడేవారు. ఎన్నికలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించడంలో శేషన్ తనకు తనే సాటి అన్పించుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే శేషన్ అంటే చండశాసన్.. దటీజ్ శేషన్ అనిపించుకున్నారాయన.

### ఎన్నో సంస్కరణలు :

ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఇప్పుడు మనం గుర్తింపుకార్డును ఉపయోగిస్తున్నామంటే.. అదంతా శేషన్ పుణ్యమే!.. అర్హులైన వారికి ఓటర్ల గుర్తింపు కార్డులు ఇచ్చే వ్యవస్థను ప్రవేశపెట్టిందీ, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుపై పరిమితి విధించిందీ, ఎన్నికల్లో అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లు ఉపయోగించడాన్ని నిలుపుదల చేసిందీ.. అన్నీ శేషనే. ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఎన్నికల నిబంధనావళిని ఏర్పాటు చేసి దేశంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు శేషన్ తీసుకున్న నిర్ణయాలు, తద్వారా ఆయన దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమే!.. ఎన్నికల వ్యవస్థను అన్నివిధాలా సంస్కరించేందుకు తనశక్తి మేరా శేషన్ కృషిచేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1996లో ప్రతిష్టాత్మకమైన రామన్ మెగసెసే అవార్డు కూడా లభించింది.

### కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలు పట్టించాడు :

విచ్చలవిడితనం, మద్యం, డబ్బు వెదజల్లుతూ ఎన్నికల్లో గెలవాలనే నాయకులకు శేషన్ సింహస్వప్నంగా నిలిచారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కొరడా ఝుళిపించారు. ఎన్నికల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపారు. ఒక్క మాలో చెప్పాలంటే శేషన్ అంటేనే అక్రమార్కులు గడగడ వణికిపోయేవారంటే అతిశయోక్తి కాదు.హింస, రిగ్గింగ్, బూత్‌లను ఆక్రమించడం, డబ్బు, మద్యంలతో ఓటర్లను లోబరుచుకోవడం వంటి అవినీతి అక్రమాలన్నిటిపై శేషన్ దృష్టి సారించడంతో అక్రమార్కులు బెంబేలెత్తిపోయారు. కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలు పట్టించాడాయన. అక్రమాలన్నిటినీ వెతికి పట్టి వారిపై అనర్హత వేటు వేసి ఎన్నికల కమిషన్ దెబ్బ ఎలా ఉంటుందో వారికి రుచిచూపించారు. ఎన్నికల జమా ఖర్చులు లెక్కలు చెప్పని 15 వందల మంది అభ్యర్థులపై, తప్పుడు లెక్కలు చెప్పిన మరో 14వేలమందిపై అనర్హత వేటు వేసి ఎన్నికల సంఘమంటే తమాషా కాదని నిరూపించాడు. అంతేకాదు, ఓటర్లకు గుర్తింపు కార్డుల విషయంలో ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నపుడు, కార్డుల్లేకుంటే ఎన్నికలుండవ్ అని ఖరాకండిగా తేల్చిచెప్పడమే కాక, గుర్తింపు కార్డులు లేనందువల్ల ఎన్నికలు వాయిదా వేస్తున్నానని శేషన్ స్పష్టం చేయడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ఎన్నికల నిబంధనల విషయంలో శేషన్ ఎంతదూరమైనా వెళ్ళేవారు. ఎన్ని విమర్శలు వచ్చినా, వత్తిళ్ళు వచ్చినా లెక్కచేసేవారు కాదు.

### నిజాయితీకి మారుపేరు, నిర్భీతిగా ఉండడమే ఆయన తీరు :

అంతేకాదు, ఓటు ఎంత పవిత్రమైనదో, ఓటుహక్కును ఎలా సద్వినియోగం చేసుకోవాలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా చేశారు. భారత ఎన్నికల నిర్వహణలో సంస్కరణలకు ఆయనే ఆద్యులయ్యారు. నీతి నిజాయితీలకు, క్రమశిక్షణకు ఆయన మారుపేరు. నిక్కచ్చిగా నిర్భీతిగా ఉండడమే ఆయన తీరు. విధి నిర్వహణలో ఎవరినీ లెక్కచేయకుండా అత్యంత బాధ్యతాయుతంగా ఉంటూ, ఎవరి బెదిరింపులకు జంకకుండా ఉండే అధికారి ఢిల్లీస్థాయిలో అప్పటో ఎవరైనా ఉన్నారా అంటే అది ఒక్క శేషన్ అనే చెప్పాలి. దేశంలో ఎన్నికల నిబంధనల అమలు విషయంలో నిష్పాక్షికంగా.. ఖరాకండిగా ఉంటూ మొండిగా.. జగమొండిగా పేరు తెచ్చుకున్న చండశాసనుడాయన. భారతదేశం గర్వించదగిన అరుదైన ఎన్నికల అధికారి..ఒకే ఒక్కడు..ఆయనే శేషన్. ఆయన సేవలు చిరస్మరణీయం!.. ఇలాంటి నిక్కచ్చి అధికారులు ఎందరుంటారు?... అందుకే శేషన్ లేని లోటు ఎవరూ తీర్చలేనిది!...

## ఇసుక వారోత్సవాలు ప్రారంభం



ఈ నెల 14వ తేదీన బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ ఇసుక రీచ్ వద్ద 'ఇసుక వారోత్సవాలను' ప్రారంభిస్తున్న కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌బాషా, ఇతర రెవెన్యూ, మైనింగ్ అధికారులు.

# బాధ్యతలు నెత్తికెత్తుకుంటారా?

## జిల్లా తెలుగుదేశంలో సంస్థాగత ఎన్నికల పర్వం

నిన్నటి లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని చావుదెబ్బ తీశాయి. పార్టీ పెట్టాక చరిత్రలో ఆ పార్టీకి ఇలాంటి ఓటమి లేదు. ఈ ఓటమి దెబ్బకు తెలుగుదేశం కేడర్ కకావికలమయ్యింది. ఎప్పుడూ లేని విధంగా ఆ పార్టీ కేడర్ ప్రత్యామ్నాయంగా పక్కచూపులకు మళ్లుకుంది. తెలుగుదేశంలో వుంటే రాజకీయ భవిష్యత్ శూన్యమనే భయంతో ద్వితీయశ్రేణిలో నాయకులు, కార్యకర్తలు వైసిపి వైపు చూస్తున్నారు. నిన్నటి ఎన్నికల దెబ్బకు నెల్లూరుజిల్లాలో టీడీపీ పరిస్థితి కోలుకోలేని విధంగా తయారైంది. నిన్నటి ఎన్నికలు చాలామంది టీడీపీ నాయకులను రాజకీయంగానే కాదు, ఆర్థికంగానూ కోలుకోలేని దెబ్బతీశాయి.

ఈ పరిస్థితుల్లో జిల్లా పార్టీలో సంస్థాగత ఎన్నికలకు శ్రీకారం చుడుతున్నారు. గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు కమిటీలను వేయబోతున్నారు. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు పార్టీ బాధ్యతలు మోయడానికి అంతగా ఆసక్తి వుండదు. అదీగాక ఇప్పటిదాకా తెలుగుదేశం పరిస్థితి వేరు.. ఇప్పుడున్న తెలుగుదేశం పరిస్థితి వేరు. ఈరోజు ప్రతిపక్షంలో వున్నా రేపు అధికారంలోకొస్తామనే నమ్మకంతో కేడర్ పనిచేసేది. ఇప్పుడు పార్టీపై ఆ నమ్మకం లేకుండాపోయింది. ఎందుకంటే ఓ పక్క చంద్రబాబుకు వయసు పెరగడం, ఇంకోపక్క బీజేపీ ఏ రూపంలో రాష్ట్రంలో ఎంటర్ అవుతుందోననే అనుమానం వుండడం. అదీగాక ఇప్పుడు పార్టీ బాధ్యతలు మోయడమంటే ఖర్చుతో కూడుకున్న పని. వందమందితో ధర్నా చేయాలన్నా జేబులో 50వేలన్నా పెట్టుకోవాలి. కాబట్టే మండలస్థాయిలో పార్టీ బాధ్యతలు తీసుకోవడం కోసం నాయకులు అంతగా ఉత్సాహం చూపడం లేదని తెలుస్తోంది.

ఇక నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లుగా నిన్నటి ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులే వుంటారా? అన్న అనుమానం లేకపోలేదు. ఒక్క ఆత్మకూరు నుండి ఓడిపోయిన బొల్లినేని కృష్ణయ్య తప్పితే మిగతా వాళ్ళంతా కూడా మళ్ళీ పార్టీ లైన్‌లోకి వచ్చారు. చంద్రబాబు మీటింగ్‌లు పెడితే వెళుతున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్న మాజీమంత్రి పి.నారాయణ కూడా చంద్రబాబుతో సమావేశాలలో కనపడుతున్నాడు. కాబట్టి నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లను సెట్ చేసుకోవడం పెద్ద సమస్య కాకపోవచ్చు.

## అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణతో...

# రియల్‌ఎస్టేట్‌కు ఊతం



ఈ రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత రియల్‌ఎస్టేట్ పెద్ద ఉపాధి కల్పనా రంగంగా తయారైంది. ఒకప్పుడు రియల్ ఎస్టేట్ అంటే ఇల్లు కట్టుకునేవాడు ఒక స్థలం కొనడం లేదా ఇతర వ్యాపార దుకాణాలకు స్థలం కొనడంవరకే పరిమితమై వుండేది. కాని, ఇప్పుడు రియల్ ఎస్టేట్ అన్నది పెద్దపెట్టుబడి సామ్రాజ్యమైంది. వేలకోట్ల వ్యాపారమైపోయింది. రియల్ ఎస్టేట్ అన్నది కేవలం కొందరికే పరిమితం కాదు, ఈ రంగంలో ఇప్పుడు అన్ని వృత్తుల వాళ్ళు, అన్ని వ్యాపార రంగాల వాళ్ళు భాగస్వాములైవున్నారు. ఒక టీచర్ అని కాదు, డాక్టర్, యాక్టర్, కలెక్టర్, కండక్టర్, అంతేనా... క్రిందిస్థాయిలో ఏ ఉద్యోగం లేని వ్యక్తి నుండి వేలకోట్ల టర్నోవర్ చేసే వ్యాపారస్థుల వరకు అందరికీ రియల్ ఎస్టేట్ ఒక ప్రవృత్తిలాగా మారింది.

నెల్లూరుజిల్లాలో ఈ రంగం మీదే కొన్ని వేలమంది రియల్టర్లు, మీడియేటర్లు, ఏజెంట్లు బ్రతుకుతున్నారు. ఇసుకను మొదలుకొని కంకర, స్టీల్, సిమెంట్, గృహోపకరణాలు, పెయింట్లు... ఇలా ఎన్నో ఇతర వ్యాపార రంగాలకు రియల్‌ఎస్టేట్ ఊతంగా నిలుస్తోంది. వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులకు రోజూ పనులు చూపించేది కూడా రియల్ ఎస్టేట్ రంగమే! అలాంటి రియల్‌ఎస్టేట్ రంగం జిల్లాలో గత పదేళ్ళుగా స్థంభించిపోయింది. వై.యస్. తర్వాత వచ్చిన ముఖ్యమంత్రుల నిర్ణయాలు సరిగాలేక జిల్లాలో అప్పటివరకు ఉరుకులు పెట్టిన రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. గత పదేళ్ల కాలంలో జిల్లాలో ఎంతోమంది రియల్టర్లు ఆర్థికంగా కుంగిపోయారు. వడ్డీలకు ఆస్తులు కరిగిపోయి, అప్పులు కట్టలేక ఐపి కూడా పెట్టి పరారైన సంఘటనలున్నాయి.

తెలుగుదేశం ప్రభుత్వం పోయి వైసిపి ప్రభుత్వం వస్తే జిల్లాలో రియల్ ఎస్టేట్‌కు మంచిరోజులొస్తాయని చాలామంది ఆశపడ్డారు. కాని, వైసిపి అధికారంలోకి వచ్చిన తొలి రెండు నెలల్లోనే రియల్ ఎస్టేట్‌కు వూహించని ఎదురుదెబ్బలు తగిలాయి. ప్రభుత్వం తొలినెలలోనే ఇసుకను నిషేధించడం ఒకటైతే, అనుమతులు లేవని చెప్పి జిల్లాలో దాదాపు 30 లేఅవుట్లను 'నుడా' అధికారులు తవ్వేశారు. ఈ రెండు పనులతో జిల్లాలో అప్పటివరకు అరకొరగా జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా పడిపోయింది. దీంతో రియల్టర్లలో ప్రభుత్వంపై కొంత అసంతృప్తి వచ్చింది.

కాగా, బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అక్రమ లేఅవుట్లలో కొన్న ఫ్లాట్లను క్రమబద్ధీకరించాలని నిర్ణయించడం రియల్టర్లకు ఒకరకంగా ఊరటనిచ్చే అంశం. ముందు ఈ లే అవుట్లలో ఫ్లాట్లు కొని ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నవారన్నా బయటపడతారు. ఈ క్రమంలోనే ఇంతవరకు అప్రూవల్ లేకుండా వేసిన లే అవుట్లకు కూడా క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించి, ఇకముందు వేయబోయే లే అవుట్లకు అప్రూవల్స్ తప్పనిసరని గట్టి నిబంధనలు పెడితే రియల్టర్లు కొంతవరకన్నా కోలుకుంటారు!

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com